17 . 09. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 110 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## నేడు ప్రజాపాలన దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్‌లో జెండా ఎగురేయనున్న సిఎం

హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):



తెలంగాణ విమోజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17వ తేదీ బుధవారం నాడు ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లా ఇంచార్జ్ మంత్రి జాతీయ జెండా

2 లో..

## కృత్రిమ కాళ్ల అమరికకు ఆర్థికసాయం

### సిఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన యువకుడు

హైదరాబాద్, సెప్టెంబర్16( వెలుతురు): కృత్రిమ కాళ్లను అమర్చుకునేందుకు ఆర్థిక సాయం అందించి, మళ్లీ నడవగలిగేలా చేసినందుకు సిఎంకు ఓ యువకుడు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ తన కుటుంబ సభ్యులతో



2 లో..

### అంధ విద్యార్థులకు సిఎం చేతుల మీదుగా

## వాయిద్యపరికరాలు అందచేత



2 లో..

హైదరాబాద్, సెప్టెంబర్16(వెలుతురు): అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లు పంపిణీ చేసారు. కరీంనగర్ జిల్లా

## ప్రిజన్ డ్యూటీమీట్ విజేతలకు సిఎం అభినందనలు



2 లో..

# యూరియా ఇంకా 2 లక్షల టన్నుల ఇవ్వండి

### కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు తుమ్మల వినతి

- బయ్యారం ఉక్కుపై నిర్ణయం తీసుకోండి
- కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయండి
- కేంద్రమంత్రులను కోరిన మంత్రి తుమ్మల



**ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్‌ను కోరామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.**

న్యూఢిల్లీ,సెప్టెంబర్16( వెలుతురు): ఎరువుల విషయంలో రైతులకు వచ్చిన ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. అధికంగా దిగుమతులపై ఆధారపడినందున ఇబ్బందులు వస్తున్నాయి. రైతులను కాపాడే విషయంలో కొన్ని చర్చలు జరిగాయి. 1968లో చేసిన విత్తన చట్టానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన చట్టాన్ని ఆమోదించాలని కోరాం. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. దేశంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు దిగుమతి సుంకాలు పెంచాలని కోరాం.కొత్తగూడెం విమానాశ్రయం గురించి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చించాం. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ పూర్తయిందని తెలిపాం. కేంద్ర ఉక్కుశాఖమంత్రి కుమారస్వామిని కలిసి బయ్యారం స్టీల్ విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బయ్యారం ఉక్కును వినియోగించి

3 లో..

## తిరుమలగిరి మండలంలో కొత్తగా 4వేల మందికి భూపట్టాలు

- సర్వేలో 3వేల మంది అనర్హులు గుర్తింపు
- మానవీయ కోణంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలి
- రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16: పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. డాక్టర్ బి. ఆర్, అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నాడు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై

2 లో..

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

### విద్యార్థులకు గుణాత్మకమైన విద్యా బోధనను అందించాలి

### ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వస్తువుల కల్పన

### గురుపూజోత్సవ దినోత్సవంలో తమ ఉపాధ్యాయులకు సన్మానం

### రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16: విద్య వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు తెచ్చిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం అబిడ్స్ లోని స్టాండ్లీ కాలేజీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం -2025 సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో

10 లో..




## రాజ్యాంగంపై బిజెపికి గౌరవం లేదు

### పాక్‌తో క్రికెట్ ఆడడంపై కెటిఆర్ విమర్శలు

3 లో..

## ఎన్నోళ్లో వేచిన కల...

# ఈనాడే నిజమయ్యే వేళ.....

### రాచబాటలకు మార్గం సుగమం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో మూడు ప్రాజెక్టులకు ఆమోదం
- మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రూ.77 కోట్లు మంజూరు చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ
- నెరవేరనున్న గన్నేరువరం వాసుల చిరకాల వాంఛ
- వేములవాడ- సిరికొండ రోడ్డు నిర్మాణానికి రూ.23 కోట్ల మంజూరు
- ఫలించిన 15 గ్రామాల పోరాటం....
- బండి సంజయ్ కు ధన్యవాదాలు చెబుతున్న ఆయా ప్రాంతాల ప్రజలు
- కాళ్లరిగేలా తిరిగి అలసిన ఆ ప్రాంత ప్రజలకు తీపి కబురు అందించిన బండి సంజయ్
- ఆర్నకొండ - మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులకు రూ.50 కోట్ల మంజూరు
- భారీ మెజారిటీతో గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల రుణం తీర్చుకుంటానంటున్న కేంద్ర మంత్రి
- మరిన్ని రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలను సైతం కేంద్రానికి పంపినట్లు వెల్లడి
- రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరిన బండి సంజయ్

*పోరాడి పోరాడి విసిగిపోయిన వాళ్లకు తీపి కబురు అందిస్తే ఎట్లుంటది? సాధ్యమే కాదని చేతులెత్తేసిన సామాన్యులకు ఆ పని సాధ్యమైతోందని తెలిస్తే ఎట్లుంటది?*



కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 16:

**ఊహించని కల నిజమైతే ఎట్లుంటది?**

ఒక్క మాటల చెప్పాలంటే.... “ఆ కిక్కే వేరబ్బా”... ఇప్పుడు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గన్నేరువరం -కొత్తపల్లి, వేములవాడ- సిరికొండ, ఆర్నకొండ - మల్యాల ప్రాంతాల మధ్యనున్న ప్రజల పరిస్థితి కూడా సరిగ్గా అట్లాంటిదే. ఈ మూడు ప్రాంతాల ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఊహించని తీపి కబురు తీసుకొచ్చారు.

2 లో..



## పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు

### గ్రూప్-1 ర్యాంకర్లు కష్టపడి చదివారు

### వారిని చులకన చేసి మాట్లాడడంసరికాదు

### మీడియా సమావేశంలో ర్యాంకర్ల తల్లిదండ్రుల ఆవేదన

హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు): పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దని గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రులు కోరారు. తమ పిల్లలు కష్టపడి చదివి ర్యాంకులు సాధిస్తే కోట్లు పెట్టి కొన్నారని అభాండాలు వేస్తున్నారని

2 లో..

## రెండు నెలల్లో ఆన్‌లైన్‌లో వంద శాతం ఫైళ్లు

- ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తెస్తాం
- రెవెన్యూ శాఖ పనితీరు పెరగాల్సిందే
- రెవెన్యూలో త్వరితగతిన టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పూర్తి
- జనవరి నుంచి ఉధృతంగా స్వచ్ఛాంధ్రప్రదేశ్
- చేతివృత్తులు, కులవృత్తులకు ఇతోధిక ప్రోత్సాహం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు



అమరావతి,సెప్టెంబర్16( వెలుతురు): రెండు నెలల్లో వంద శాతం ఫైళ్లు ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేనని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మ్యానిపులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తెస్తామన్నారు. :డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై రెండోరోజు కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు సమీక్షించారు. ఎన్నిసార్లు చెబుతున్నా

2 లో..

## రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఆలయాల నిర్మాణం

- బ్రహ్మోత్సవాల్లో సిఫార్సు లేఖల దర్శనాలు రద్దు
- 24 చంద్రబాబు దంపతులు శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ
- ఇస్రో సహకారంతో భక్తుల సంఖ్యను గణనకు నిర్ణయం
- టిటిడి పాలకమండలి పలు కీలక నిర్ణయాలు

### 23న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల,సెప్టెంబర్16( వెలుతురు): రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఆలయాలను నిర్మించాలని తితిదే ధర్మకర్తల మండలిలో నిర్ణయించారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 6 ఆలయాల వరకు నిర్మిస్తామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ధర్మకర్తల మండలి

2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## నేడు ప్రజాపాలన దినోత్సవం

ఎగురవేయాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. సిఎం రేవంత్ రెడ్డి సైతం 17వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జాతీయ జెండా ఎగురవేయనున్నారు. పబ్లిక్ గార్డెన్ జరిగే కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి సందేశం ఇస్తారు. డిప్యూటీ- సిఎం భట్టి విక్రమార్క ఆయన సొంత జిల్లా ఖమ్మంలో జెండా ఆవిష్కరించనుండగా మంత్రులు వివేక్ మెదక్ జిల్లాలో, కొండా సురేఖ, వరంగల్‌లో, అడ్లూరి లక్ష్మణ్, కరీంనగర్‌లో, భద్రాద్రి కొత్తగూడెం తుమ్మల నాగేశ్వరరావు, మహబూబ్‌నగర్ జూపల్లి కృష్ణారావు, ములుగు సీతక్క, రంగారెడ్డిలో శ్రీధర్‌బాబు, సంగారెడ్డిలో దామోదర రాజనర్సింహ తదితరులు జెండా ఎగురేయనున్నారు. సెప్టెంబర్ 17వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తుండగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తోంది.

## కృత్రిమ కాళ్ల అమరికకు ఆర్థికసాయం

కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ని కలిశారు. ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ప్రోత్సాహకం అందించి మళ్లీ నడిచేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 2, 2024న రైలులో రాజస్థాన్ వెళ్తున్న రాహుల్‌ను కొందరు దుండగులు రైలు నుంచి కిందికి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్‌కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. అందుకు కృతజ్ఞతగా రాహుల్ తన కుటుంబంతో కలిసి వచ్చి మర్యాద పూర్వకంగా సీఎంను కలిశారు. తనను మళ్లీ నిలబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కటుఉంబ సభ్యులుకూడా సిఎం సాయం పట్ల అభినందనలు తెలిపారు.

### అంధ విద్యార్థులకు సిఎం చేతుల మీదుగా వాయిద్యపరికరాలు అందచేత

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు సంగీతంలో జిల్లా యంత్రాంగం శిక్షణ అందించింది. ఈ క్రమంలో వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట పాట పాడి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన పాటల సీడీని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, తదితరులు పాల్గొన్నారు.


## ప్రిజన్ డ్యూటీమీట్ విజేతలకు సిఎం అభినందనలు

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**
7వ ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో వివిధ పోటీలలో పతకాలు సాధించిన వారిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో జరిగిన పోటీలలో 133 పతకాల్లో 28 సాధించారు. ఇందులో 21 బంగారు, 4 రజతం, 3 కాంస్యంపతకాలను తెలంగాణ కైవసం చేసుకున్నది. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, జైళ్ల విభాగం డీజీ సౌమ్య మిశ్రా, ఐజీ మురళి బాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, ఎస్పీలు శివ కుమార్ గౌడ్, కళాసాగర్, డ్యూటీ- మీట్ పోటీ విజేతలు పాల్గొన్నారు.

## తిరుమలగిరి మండలంలో కొత్తగా 4వేల మందికి భూపట్టాలు

అటవీ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖతో కలిసి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె. జానా రెడ్డి, నాగార్జున సాగర్ శాసన సభ్యులు కె. జయవీర్ రెడ్డి, దేవరకొండ శాసనసభ్యులు బాలూ నాయిక్, రెవెన్యూ శాఖ సెక్రటరీ డి ఎస్.లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 40-50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీ వేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ , ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిరుమల గిరి ( సాగర్) మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించడం జరిగిందని ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం 23వేల ఎకరాలో సర్వే నిర్వహించగా అందులో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. వీటిలో 4 వేల ఎకరాలు పాసుపుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎకరాలకు సంబంధించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. అంతేగాక ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి వారి పాసు పుస్తకాలను రద్దుచేశామని తెలిపారు. వీరికి రైతు భరోసా, రైతు భీమా తదితరాలను రద్దు చేశామన్నారు. సర్వేలో భాగంగా 7వేల ఎకరాలు అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### రెండు నెలల్లో ఆన్‌లైన్‌లో వంద శాతం ఫైళ్లు



రెవెన్యూశాఖ సంతృప్త స్థాయిలో సేవలు అందించట్లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ- ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తామన్నారు. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ వైపు మనం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు చంద్రబాబు సూచించారు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు అక్టోబర్ చివరి నాటికి సిద్ధమవుతాయని చెప్పారు. ఇకపోతే రాష్ట్రంలో జనవరి నుంచి వ్యర్థం అనేది ఎక్కడా కనిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ కోసం ఏ జిల్లాలో పైలట్ ప్రాజెక్టు చేపట్టినా..అది రాష్ట్రమంతా వర్తింపజేయాలని సూచించారు. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను ఉద్యమంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఘన వ్యర్థాల షెడ్ల నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించారు. కలెక్టర్ల సదస్సులో స్వచ్ఛాంధ్ర, అటవీ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించాలని కోరారు. వెదురు ఉత్పత్తులు చేసేవారికి వెదురును సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. చేతివృత్తులు, కులవృత్తులు దెబ్బతినకుండా కాపాడాలన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వకుండా పైపులైన్లు పెట్టేలా ఎస్ఓపీ చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయతీలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్వచ్ఛత అంటే.. శుభ్రత ఒక్కటే కాదు, ప్రజల ఆలోచన కూడా మారాలన్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవ చేపట్టాలని తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ పాలసీలు జరగాలన్నారు. ఐదు జోన్లలో ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు- చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఉన్నా.. డ్రెయిన్లు సరిగ్గా లేవని మేజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.. రెవెన్యూలో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, భూములు, ఆదాయార్జన శాఖలపై కలెక్టర్ల సదస్సులో చర్చించారు. సింహాచల భూముల పంచ గ్రామాల సమస్యను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు పెద్దమొత్తంలో పరిష్కారం అవుతాయని తెలిపారు పోలీసు, రెవెన్యూ విభాగానికి వచ్చిన ఫిర్యాదులో 70 శాతం మేర ఉన్నాయని గుర్తుచేశారు. ఆర్ఓఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. గత పాలకుల తప్పులతో ఈ స్థాయిలో ఏపీలో రెవెన్యూ, భూ వివాదాల ఫిర్యాదులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎన్నోళ్లో వేచిన కల... ఈనాడే నిజమయ్యే వేళ.....

అదేమిటంటే గన్నేరువరం ప్రజల చిరకాల వాంఛ అయిన మానేరు నదిపై హైలెవల్ వంతెనను నిర్మించేందుకు కేంద్రాన్ని ఒప్పించి రూ.77 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. అట్లాగే చొప్పదండి నియోజకవర్గంలోని ఆర్నకొండ గ్రామం నుండి మల్యాల క్రాస్ రోడ్డు వరకు డబుల్ లేన్ విస్తరణ పనుల కోసం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతోపాటు వేములవాడ నుండి సిరికొండ వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.23 కోట్ల నిధులకు ఆమోద ముద్ర వేయించారు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 412.36 కి.మీల మేరకు 34 ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ రూ.868 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆ నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర రహదారుల మౌలిక సదుపాయల నిధి(సీఆర్ఐఎఫ్ కింద తెలంగాణకు మంజూరైన మొత్తం రూ.868 కోట్ల నిధుల్లో ఏకంగా రూ.150 కోట్లు ఒక్క కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికే కేటాయించడం విశేషం. ఆ వివరాల్లోకి వెళితే...

మానేరు నదిపై హైలెవల్ వంతెనను నిర్మించాలనేది గన్నేరువాసుల చిరకాల వాంఛ. దీనికోసం గన్నేరువరం మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దశాబ్దన్నర కాలంగా పోరాడుతూనే ఉన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉన్నారు. ఐక్య కార్యాచరణ సమితి పేరుతో మండల ప్రజలంతా ధర్నాలు, రాస్తారోకోలు, బంద్ లుసహా అనేక ఉద్యమాలు నిర్వహించారు. తొలిసారి ఎంపీగా పోటీ చేసే సమయంలో బండి సంజయ్ కుమార్ వారి ఉద్యమానికి బాసటగా నిలిచారు. గెలిస్తే బ్రిడ్జి నిర్మాణానికి తన వంతు క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్రానికి పంపాల్సి ఉంది. కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే కేంద్రాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గత ఐదేళ్లుగా ఆ ప్రతిపాదనలకు మోక్షం కలగలేదు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, కేంద్రంలో బండి సంజయ్ కేంద్ర మంత్రి కావడంతో మళ్లీ ఈ అంశం తెరపైకి వచ్చింది. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి విజప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించేలా చేశారు. కేంద్రం వద్దకు ప్రతిపాదనలు రాగానే కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని, ఆ శాఖ ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి గన్నేరు వరం ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గడ్కరీ తాజాగా ఆ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారు. మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు గుండ్లపల్లి పోతూరు రోడ్, బావూపేట ఖాజీపూర్ రోడ్డు నిర్మాణంవల్ల గన్నేరు వరంతోపాటు బెజ్జంకి, ఇల్లంతకుంట, కొత్తపల్లి, కరీంనగర్ మండలాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ బ్రిడ్జి లేకపోవడంవల్ల గన్నేరువరం నుండి కరీంనగర్ కు రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. దాదాపు 40 కి.మీల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. తాజాగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యితే దాదాపు 30 కి.మీలకు పైగా దూరం తగ్గనుంది. చదువుకోవడానికి ప్రతిరోజు కరీంనగర్ వెళ్లే విద్యార్థులతోపాటు వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకునే ప్రజలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరబోతోంది. ఈ బ్రిడ్జి నిర్మించాలంటూ దశాబ్దన్నర కాలంగా పోరాడుతున్న గన్నేరువరం ప్రజల చిరకాల వాంఛ తీరబోతోంది. వీరంతా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నారు.

చొప్పదండి నియోజకవర్గంలోని ఆర్నకొండ గ్రామం నుండి మల్యాల క్రాస్ రోడ్డు వరకు దాదాపు 35 కి.మీల మేరకు రోడ్డు ఏమాత్రం బాగోలేదు. సింగిల్ రోడ్డు కావడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతూ స్థానిక ప్రజలు అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. అనేక రూపాల్లో వినతులు, నిరసనలు, ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోపాటు నియోజకవర్గ బీజేపీ నాయకులు పలుమార్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి ఈ విషయాన్ని ప్రస్తావించారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ కుమార్ ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి పంపించారు. కేంద్ర మంత్రి గడ్కరీ, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి డబుల్ లేన్ రోడ్డు విస్తరణ పనుల అవసరాన్ని నొక్కి చెప్పారు. సానుకూలంగా స్పందించిన కేంద్రం తాజాగా ఆర్నకొండ నుండి మల్యాల క్రాస్ రోడ్డు వరకు డబుల్ లేన్ రోడ్డు విస్తరణ పనులకు సీఆర్ఐఎఫ్ పథకంలో భాగంగా రూ.50 కోట్లు మంజూరు చేసింది. చొప్పదండి నియోజకవర్గంలోని దాదాపుగా 15 గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు విస్తరణవల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వాస్తవానికి ఈ గ్రామాల ప్రజలు కూడా అసలు ఈ రోడ్డు బాగుపడుతదని కూడా అనుకోలేదు. ఊహించని కల నెరవేరడంతో ఆ ప్రాంత ప్రజల సంతోషానికి అవధుల్లేవు. ముఖ్యంగా అర్నకొండ, రాగంపేట, కుర్మపల్లి, తిర్మల పూర్, బూరుగుపల్లి, ర్యాలపల్లి, తాటిపల్లి, ముత్యంపేట, మల్యాల %ఇ% రోడ్డు వరకు ప్రజలంతా ఇక తమ రవాణా కష్టాలు తీరిపోతాయని, వ్యాపార, వాణిజ్య, విద్యా అవకాశాలు పెరుగుతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘనత సాధించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు మీడియా, సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నారు.

వేములవాడ నుండి సిరికొండ వరకు దాదాపు 76 కి.మీల ప్రయాణం. ఇందులో ఇందులో వేములవాడ నుండి దాదాపు 18.2 కి.మీల మేరకు రోడ్డును నిర్మించాలనేది ఈ ప్రాంత ప్రజల 20 ఏళ్ల కల. ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల నుండి ఈ డిమాండ్ వస్తూనే ఉంది. వివిధ రూపాల్లో ఆందోళనలు చేసి అలసిపోయారు. అధికారుల, ప్రజా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయారు. ప్రజా సంగ్రామ యాత్ర సందర్భంగా బండి సంజయ్ కుమార్ వేములవాడ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న సమయంలో స్థానిక ప్రజలను వెంటబెట్టుకుని బీజేపీ నాయకులు ఆయనను కలిసి ఈ రోడ్డు గురించి ప్రస్తావించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక తప్పనిసరిగా రోడ్డును విస్తరిస్తామని అప్పట్లో సంజయ్ హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రజలు ఆశలు వదులుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ నియోజకవర్గంలోని రోడ్ల విస్తరణ, నిర్మాణ పనులకు సంబంధించి అనేక ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి పంపారు. అందులో వేములవాడ నుండి సిరికొండ వరకు రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీ కలిసి ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గడ్కరీ రూ.23 కోట్ల నిధులను మంజూరు చేయడం గమనార్హం. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే కరీంనగర్ నుంచి నిజామాబాదు జిల్లాకు వెళ్లేందుకు దగ్గరి మార్గం కానుంది. సిరిసిల్ల జిల్లా నుంచి నిజామాబాదు మరొక రాచ మార్గం కాబోతోంది. వేములవాడ, హన్మాజీపేట, యెన్గల్,(చందుర్తి),బండపల్లి(చందుర్తి), బావు సాయిపేట(కొనరావుపేట్), వట్టిమల్ల(కొనరావు పెట్),మర్రిమడ్ల(కొనరావుపేట), చీమన్ పల్లి(నిజా%శీ% బాద్), సిరికొండ(నిజామాబాద్) వరకు వెళ్లే అవకాశముంది. ఈ రోడ్డు వల్ల వేములవాడ పుణ్యక్షేత్రానికి వచ్చిన వారంతా నిజామాబాద్ జిల్లాకు కూడా వెళ్ళే అవకాశము ఉంటుంది. ఆశలు వదులుకున్న రోడ్డుకు ఆమోదం తెలిపి తీపి కబురు అందించడంతో ఈ ప్రాంత వాసులంతా ఆనందం అంతా ఇంతా కాదు. బండి సంజయ్ కు రుణపడి ఉంటామని పేర్కొంటూ మీడియా, సోషల్ మీడియా వేదికగా ధన్యవాదాలు చెబుతుండటం గమనార్హం.

### శక్తివంచన లేకుండా పనిచేస్తున్నా.....కరీంనగర్ పార్లమెంట్ ప్రజల రుణం తీర్చుకుంటా : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

గన్నేరువరం -కొత్తపల్లి వరకు మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణంతోపాటు, వేములవాడ- సిరికొండ, ఆర్నకొండ %-% మల్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి గడ్కరీ, ఆ శాఖ ఉన్నతాధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల రుణం తీర్చుకునేందుకు శక్తివంచన లేకుండా క్రుషి చేస్తున్నానని తెలిపారు. రాజకీయాలకు తావులేకుండా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి అన్ని పార్టీల నేతలను కలుపుకుపోతున్నానని పేర్కొన్నారు. అందులో భాగంగా కేశవ పట్నం నుండి సైదాపూర్, కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాంద్రియాల, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుండి ముస్తాబాద్ మండలం బండలింగాపూర్ వరకు రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలను, చందుర్తి నుండి మోత్కురావుపేట మధ్య బ్రిడ్జి, రామడుగు మండంలోని కిష్టంపల్లి బ్రిడ్జి, శంకరపట్నం మండలంలోని అర్కండ్ల కెనాల్ వద్ద హైలెవల్ బ్రిడ్జిసహా అనేక ప్రతిపాదనలను సైతం కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. దశలవారీగా ఆయా ప్రతిపాదనలకు సైతం ఆమోదముద్ర వేయించేందుకు క్రుషి చేస్తున్నట్లు వివరించారు.

## పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు

వాపోయారు. రూ.3 కోట్లు- ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నారని కొందరు ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత డబ్బే ఉంటే తమ పిల్లఉ ఉద్యోగాలు కొనుక్కోవాల్సిన ఖర్మ లేదన్నారు. ఇటీవలి హైకోర్టు తీర్పు, వస్తున్న ఆరోపణల నేపథ్యంలో గ్రూప్-1 ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు కొందరు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 9న గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని వాటిని రద్దు చేయాలని కోరుతూ కొందరు, వాటిని రద్దు చేయరాదంటూ మరికొందరు దాఖలు చేసిన 12 పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు.. 222 పేజీల తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు మీడియా సమావేశం నిర్వహించారు.అసత్య ఆరోపణలతో మనోవేదనకు గురిచేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు.గ్రూప్-1 పరీక్షల వివాదాన్ని రాజకీయం చేయొద్దని,. కొందరు నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆరోపణలు చేసేవారు వాటిని నిరూపించాలన్నారు. అప్పులు చేసి, ఓ పూట తిని.. మరో పూట తినక రెక్కలు ముక్కలయ్యేలా మా పిల్లలను కష్టపడి చదివించాం. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లు- ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నట్లు నిందలు వేస్తున్నారు. మాకు అంత స్థోమత లేదు. మీ రాజకీయాల కోసం మా పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దని వేడుకున్నారు. అంతటి స్థోమతే ఉంటే ఈ ఉద్యోగాల కోసం వెంపర్లాడమని అన్నారు.

పోస్టులు కొన్నామన్న ప్రచారంతో మా పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. అవమానాలకు గురవుతున్నారని,పోస్టులు కొనుక్కున్నామన్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా మేం సిద్ధం అన్నారు. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు గురిచేయొద్దు. అన్ని పార్టీల నేతలు సహకరించి మా బాధలు అర్థం చేసుకోవాలి. లేనిపోని దుష్ప్రచారాలు వ్యాప్తి చేయకుండా వాస్తవాలను తెలియపరచాలని కోరారు. మా పిల్లలు ఎంతో కష్టపడి గ్రూప్-1 ర్యాంక్ సాధించారు. హైకోర్టు మాకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. భర్త చనిపోతే ఓ పాఠశాలలో రూ.10వేల జీతానికి పనిచేస్తున్నా. రూ.30వేలు ఎప్పుడూ కళ్లతో చూడలేదు. రూ.3 కోట్లకు ఉద్యోగం కొన్నట్లు- నిరూపిస్తే నా మరణ శాసనం నేనే రాసుకుంటా. మా అబ్బాయికి అలాంటి ఉద్యోగం కూడా వద్దని 366వ ర్యాంకర్ తల్లి కన్నీటి పర్యంతమవుతూ చెప్పింది. ఎంతో కృషి పట్టుదలతో ర్యాంక్ సాధిస్తే.. కొంతమంది స్వార్థపరులు గ్రూప్-1ను రాజకీయం చేస్తున్నారు. ఓపిక, సహనంతో ఉన్నాం.. ఇప్పుడు చాలా బాధగా ఉంది. రూ.3కోట్లు- కాదు.. రూ.30లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ కూడా చూడలేదు. రాత్రీపగలు తేడా లేకుండా కూలి పనులు చేసుకుని చదివించాం.

ఆధారాలతో ఆరోపణలు చేయండని 67వ ర్యాంకర్ తల్లి లలిత ఆవేదన చెందారు. రాజకీయ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లకు ఉద్యోగాలు కొన్నామని నిందలు వేస్తున్నారు. ఫలితాలు వచ్చాక కొత్తగా ఈ రాజకీయం చేస్తున్నారు. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు గురిచేయొద్దని, 46వ ర్యాంకర్ తండ్రి ఆవేదన చెదారు. ఉద్యోగం అమ్మింది ఎవరు? కొన్నది ఎవరో ఆధారాలు చూపించాలి. నా కుమారుడికి గతంలో ఎస్సై ఉద్యోగం వస్తే గ్రూప్-1 కోసం చదివాడు. ఇప్పుడు ఇలా నిరాధార ఆరోపణలు చేయడమేంటని 60వ ర్యాంకర్ మహేశ్ తండ్రి వాపోయాడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో తీరుగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఆలయాల నిర్మాణం

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. మతమార్పిడుల కట్టడికి శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మిస్తామన్నారు. ప్రధానంగా శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించినట్లు- తెలిపిన ఆయన.. తొలిసారిగా బ్రహ్మోత్సవాలను ఇస్రో పరిశీలించబోతున్నట్లు- చెప్పారు. ఈనెల 23న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 24 నుంచి అక్టోబరు 2 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు- చేస్తున్నాం. ఈనెల 24న మీనలగ్నంలో ధ్వజారోహణం, అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. పది రోజులపాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈనెల 28న శ్రీవారి గరుడసేవకు 3 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నాం. చిన్నపిల్లలు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ విధానం అమలు చేయబోతున్నాం అని బీఆర్ నాయుడు తెలిపారు. అంతకుముందు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులతో కలిపి శ్రీవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్- 2025ని బీఆర్ నాయుడు విడుదల చేశారు.తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు- చేస్తున్నట్లు- టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్ లో మంగళవారం ఛైర్మన్ అధ్యక్షతన టిటిడి పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తో కలిసి ఛైర్మన్ మీడియాకు వివరించారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు- వస్త్రాలను సమర్పిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు- చేపడుతున్నాం. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీవారు పెద్దశేష వాహనంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సెప్టెంబరు 25వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిఏసి- 5 శ్రీ వెంకటాద్రి నిలయాన్ని ప్రారంభిస్తారు. అదేవిధంగా 2026వ సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు ఇస్రో సహకారంతో శాట్ లైట్ ఆధారంగా భక్తుల సంఖ్యను గణన చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, వివిధ దేవతామూర్తుల ఆర్చిలు, ఎల్ఇడి తోరణాలు, అన్ని ప్రధాన కూడళ్ళలో పెద్ద ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బ్రహ్మోత్సల సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దివ్యాంగులు, వయోవృద్ధులు, ఎన్.ఆర్.ఐ, చిన్నపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేశారు. బ్రేక్ దర్శనాలు కేవలం ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశారు. ప్రతి రోజు 8 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ నెల 28న గరుడ సేవ సందర్భంగా ఈ నెల 27వ తేదీ రాత్రి 9 గంటల నుండి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తిరుమలకు ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేస్తున్నాం. అదేవిధంగా, అలిపిరి, శ్రీవారి మెట్టు- నడక దారులు 28వ తేదీన రౌండ్ ద క్లాక్ తెరిచే ఉంటాయి. తిరుమలలోని రద్ధీ ప్రాంతాల్లో అదనపు సిసి కెమెరాలు ఏర్పాటు- చేస్తున్నాం.ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు స్వామివారి వాహనసేవలను వీక్షించేలా హెచ్‌డి క్యాలిటీతో నాణ్యంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తాం. గరుడసేవనాడు 4 లక్షల మజ్జిగ ప్యాకెట్లు- భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. తిరుమలలో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా ఫల పుష్ప ప్రదర్శన, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు- చేస్తున్నాం. అదే విధంగా, కర్ణాటక రాష్ట్రం బెలగావిలోని కొలికోప్ప గ్రామంలో శ్రీవాణి ట్రస్టు నిధులతో 7 ఎకరాలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు ఆమోదించాం. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రూ. 7.20 కోట్లతో రాజగోపురం, ముఖ మండపం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి ఆభరణాలు, అదేవిధంగా ఆలయంలో తాగు నీటి సౌకర్యం, ఆర్చి, మరుగుదొడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు దశలవారిగా చేపట్టేందుకు నిర్ణయం. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరామస్వామివారి ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక మండపం, రాజగోపురం, ఆర్చి, కల్యాణ మండపం తదితర అభివృద్ధి పనులకు రూ.5.73 కోట్లు-, తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి పుష్కరిణి పునః నిర్మాణానికి రూ.1.50 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బద్రి వెంకటరెడ్డి, బద్రి విష్ణువర్ధన్ రెడ్డిలు గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం కాజా గ్రామంలో సర్వే నంబరు 141-2లో రూ.89.54 లక్షల విలువ చేసే 0.74 సెంట్ల స్థలాన్ని దాతలు విరాళంగా అందించారు. సదరు భూమిని స్వీకరించేందుకు ఆమోదం తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ లో చేరిన ఆదిలాబాద్ జిల్లా నాయకులు..

- ఘర్ వాపసి షురూ...



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఆదిలాబాద్ నాయకులు మంగళ వారం నాడు హైదరాబాద్ లో పలువురు ఆదిలాబాద్ జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఆదిలాబాద్ మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డి లు మంగళవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో పార్టీని వీడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరిగి కాంగ్రెస్ లో చేరాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన ప్రతిపాదనను కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయం తెలిసిందే..

# హైదరాబాద్ లిబరేషన్ డే ఫోటో ఎగ్జిబిషన్" ను ప్రారంభించిన 12(టీ) బెటాలియన్ ఎన్.సి.సి. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియాజిత్ సూర్

**హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం**





**నిజామాబాద్ వెలుతురు 16 సెప్టెంబర్, 2025:** హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని 12(టీ) బెటాలియన్ ఎన్.సి.సి. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియాజిత్ సూర్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్ లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల గ్రౌండ్లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లిబరేషన్ డే ఫోటో ఎగ్జిబిషన్ ను 12(టీ) బెటాలియన్ ఎన్.సి.సి. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియాజిత్ సూర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) హైదరాబాద్ లిబరేషన్ డే ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా ప్రశంసనీయమన్నారు. హైదరాబాద్ లిబరేషన్ లో పోరాడిన నాయకులు ఎవరు, తదితర అంశాలను ఫోటో ఎగ్జిబిషన్లో కలవన్నారు. అప్పట్లో జరిగిన వివిధ సంఘటనలు ఫోటో ఎగ్జిబిషన్ లో తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ మాట్లాడుతూ...ఈ ఎగ్జిబిషన్ లో నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసేందుకు పోరాడిన రామ్ జి గోండు, కుమురం భీమ్, చాకలి ఐలమ్మ, బండి యాదగిరి, భాగ్యరెడ్డి వర్మ, కోదాటి నారాయణరావు, వందేమాతరం రామచంద్రరావు, తదితరుల ప్రముఖుల ఫొటోలను ఏర్పాటు చేశామన్నారు. బైరాన్ పల్లి ఘటన, పరకాల మరణకాండ, బ్రిటిష్ సైన్యంపై తిరుగుబాటు, వందేమాతరం ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, ఆపరేషన్ పోలో వంటి ప్రధాన ఘట్టాలను వివరించే ఫొటోలు కూడా ప్రదర్శనకు ఉంచామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 18 వరకు కొనసాగుతుందన్నారు.

బహుమతులు ప్రధానం

హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకలలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిల చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అంతకు ముందు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రామ్ మోహన్ రెడ్డి, డిస్ట్రిక్ ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. కె. రసూల్ బి, పోస్టల్ డిపార్ట్మెంట్ సీనియర్ సూపర్డెంట్ కే జనార్ధన్ రెడ్డి, జిల్లా యువజన ఆఫీసర్ శైలీ బెల్లాల్, ఆల్ ఇండియా రేడియో ట్రాన్స్మిషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ రంగా రత్నం, కళాశాల పిఆర్ ఓ డాక్టర్ దండు స్వామి, చరిత్ర విభాగపతి రమేష్ గౌడ్, ఎన్.సి.సి. ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బాలమణి, సీబీసీ ఏపీఏ రషిద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ కల్పించాలి

- సంవత్సరం కాలంలో తెలంగాన సాధించిన విజయాలను వివరించిన మంత్రి తుమ్మల
- రైతుల ఆదాయం పెరిగేలా పాలసీలలో మార్పులు, రూపకల్పన జరగాలి
- రైతుల ఆదాయం పెరుగుతుందా లేదా అనే విషయంపై తరుచుగా సర్వే నిర్వహించాలి
- తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలి, ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలి
- విత్తన చట్టాన్ని పున:సమీక్షించి, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలి
- జాతీయ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న మంత్రి తుమ్మల



**ఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 16:** ఢిల్లీలో గౌరవ కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రబీ అభియాన్ - 2025 వ్యవసాయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సదస్సుకు పలు రాష్ట్రాల నుండి వ్యవసాయ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం "సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందిందని, దేశానికి అవసరమయ్యే విత్తనాల్లో దాదాపు 60 శాతం తెలంగాణ నుండే సరఫరా అవుతున్నాయని, అలాగే 20కుపైగా దేశాలకు విత్తనాల ఎగుమతి జరుగుతోందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో కూడా రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం 1.5 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతుండగా, దీన్ని త్వరలో 8 లక్షల హెక్టార్లకు విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్, వేరుశెనగ, మిరప, పసుపు, సిరిధాన్యాలు వంటి పంటలు విస్తృతంగా పండుతున్నాయని, అందులో తాండూరు కంది, చాపట మిరప %+×% గుర్తింపు పొందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, రైతు బీమా, ఉచిత 24 గంటల విద్యుత్ సరఫరా, పంట రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీలు వంటి పథకాలతో రైతులకు భద్రత, నమ్మకం కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 2,601 రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ... దాదాపు 13 లక్షల మంది రైతులు, అందులో 3 లక్షల మహిళా రైతులు నేరుగా శాస్త్రవేత్తలు, అధికారులతో సంప్రదింపులు జరిపేలా అవకాశాలు కల్పించామని అన్నారు. రాష్ట్ర అవసరాల నేపథ్యంలో, రబీ సీజన్‌లో యూరియా సహా ఎరువులను సమయానుసారంగా తగిన మోతాదులో సరఫరా జరగాలని, ఎరువుల కొనుగోలులో ఉన్న 25 శాతం పరిమితిని అన్ని పంటలకూ తొలగించాలని, జొన్న, మొక్కజొన్నలను ప్రైస్ సపోర్ట్ స్కీమ్‌లో చేర్చాలని ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు. పామాయిల్ పై ప్రస్తుతం ఉన్న సబ్సిడీ 33 శాతం నుండి 50 శాతానికి పెంచి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని, తెలంగాణ విత్తన రంగానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని, ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ కల్పించాలని, అనేక చిన్న చిన్న పథకాలకు బదులుగా సమన్వయం చేసి సరళీకృతం చేస్తే రైతులకు ఎక్కువ లబ్ధి చేకూరుతుందని సూచించారు. రైతు ఆదాయం పెరగేలా పాలసీలలో మార్పులు తీసుకురావాలని అన్నారు. MGNREGA లాగానే రైతుల ఆదాయం



పెరుగుతోందా లేదా అన్న దానిపై తరచుగా సర్వేలు చేయాలని చెప్పారు. ప్రస్తుతమున్న సబ్సిడీలతో నైట్రోజన్ ఎరువుల వాడకం పెరిగి భూమిలోని పోషకాల అసమతుల్యత పెరుగుతోందని, కాబట్టి ఎరువుల ధరలను సవ్యంగా ఉంచి సమతుల్య పోషకాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. సీడ్ చట్టాన్ని పునఃసమీక్షించి నాణ్యత లేని విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను తీసుకురావాలని ఆయన కోరారు. పురోగామి విధానాలు, బలమైన పరిశోధన సంబంధాలు, రైతు స్నేహపూర్వక పథకాలు ఉంటే వ్యవసాయం లాభదాయకంగా, బలంగా, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలిగే రంగంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కేంద్రం సమయానుకూల సహకారం అందించడంతో పాటు జాతీయ స్థాయి సంస్కరణలతో భారత వ్యవసాయాన్ని మరింత సురక్షితంగా మార్చి అందరికీ ఆహార, పోషక భద్రతను అందించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూరియా ఇంకా 2 లక్షల టన్నుల ఇవ్వండి

తెలంగాణకు న్యాయం చేయాలని కేంద్ర ఉక్కు శాఖమంత్రి కుమారస్వామిని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. ఢిల్లీలో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ఉక్కు శాఖమంత్రి కుమారస్వామితో తుమ్మల మంగళవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా బయ్యారం స్టీల్ ప్లాంట్ గురించి ఈ సమావేశంలో మాట్లాడారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్య అని పేర్కొన్నారు. అక్కడ ఉన్న మినరల్‌ను ఏ విధంగా ఉపయోగించుకుంటారో కేందప్రభుత్వం పరిశీలించి తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. అలాగే, కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కూడా మంత్రి తుమ్మల కలిశారు . కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు- చేయాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటు- చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారని అన్నారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలకు భూ సేకరణ పూర్తయిందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు.. హెవీ వాటర్ ప్లాంట్..ఐటీ-సీ ,బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ- కొత్తగూడెం లో ఏర్పాటు- చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటు-ందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం లో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బి÷-డడైన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు

# రజక వృత్తిదారుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకెళ్లి పరిష్కరిస్తాం..

- మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలి
- వృత్తి చేసుకునే వారికి ప్రతి నియోజకవర్గానికి ఒక అధునాతన మోడర్న్ దోభిఘాట్ నిర్మించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం..
- ఎలాంటి ఆటంకాలు లేకుండా రజక వృత్తదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం
- రజక వృత్తిదారుల అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** బలహీన వర్గాల్లో కుల వృత్తుల ఆధారపడే కులాలు మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆర్థిక వృద్ధి సాధించేలా కుల వృత్తులు ఎదగాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో షాద్ నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో రజక వృత్తిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్ రజక వృత్తిదారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయి బ్రాహ్మణ సెలూన్ లు బ్యూటీపార్లర్ లుగా ,రజక దోభిఘాట్ లు అధునాతన డ్రైక్లినింగ్ లుగా మారినప్పుడే వృత్తికి సార్థకంగా మారుతుందని అప్పుడే వృత్తిదారులు ఆర్థికంగా ఎదుగుతారని మంతి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తో మాట్లాడి వారి సమస్యల పై ఆరా తీశారు. త్వరలోనే 9 మోడర్న్ డోబిఘాట్ లు రాబోతున్నాయని , రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 మోడర్న్ దోభిఘాట్ లు ఏర్పాటు చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నగరంలో 12 ధోబిఘాట్ లకు ఏర్పడిన సమస్యలు మరమత్తులు చేసేలా కార్యచరణ తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాలువలు , చెరువులు ఇతర ప్రాంతాల్లో వృత్తి కొనసాగుతుంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న బేగంపేట ధోబిఘాట్ పై రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పై ఆరా తీశారు. చాలా జిల్లాల్లో రజక వృత్తిదారులకు కేటాయించిన భూమిపై వస్తున్న ఇబ్బందులు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు ,కలెక్టర్ లు సమన్వయం చేసుకుని పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నాయి బ్రాహ్మణ సెలూన్ లకు, రజక వృత్తిదారులకు ఇస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తున్నామని తెలిపారు. సమీక్షా సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయదేవి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్డీవో , బీసీ సంక్షేమ శాఖ అధికారులు,రజక వృత్తిదారుల సంఘం నేతలు

# రాజ్యాంగంపై బిజెపికి గౌరవం లేదు

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):** భారత రాజ్యాంగంపైన, సుప్రీంకోర్టుపైన బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పహల్గాం మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటం బీజేపీ కపట దేశభక్తికి నిదర్శనమని మంగళవారం ఉదయం కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్ఎస్ స్వాగతించడాన్ని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీది నకిలీ జాతీయవాదమని, తమది ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయ వాదమని స్పష్టంచేశారు. కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి భారతీయుడిని సమానంగా ఆదరించడమే తమ దృష్టిలో నిజమైన జాతీయవాదం అన్నారు. జాతీయవాదానికి, దురహంకార దేశభక్తికి మధ్య ఉన్న తేడాను తెలుసుకోవడమే అసలైన దేశభక్తి అని చెప్పారు. పహల్గాం దారుణ మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడించిన బీజేపీకి బీఆర్ఎస్ దేశభక్తి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని విమర్శించారు.పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో మరణించిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యం అన్నారు. పహల్గాం బాధిత కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోకుండా కోట్లాది భారతీయులను మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.




## సంపాదకీయం..

# విమోచనంటేనే పాలకుల్లో వణుకు !

తెలంగాణ విమోచనోత్సవాల నిర్వహణలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా జరుపుకుంటున్నారు. విమోచనోత్సవంతో లబ్ది పొందాలన్న భావనలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే దీనిపై బలంగా నిలబడ్డారు. అధికారికంగా విమోచనోత్సవం జరపాలని కోరుతున్నారు. అయినా అధికార పార్టీ కాంగ్రెస్ ఇందుకు సుముఖంగా లేదు. కేవలం ప్రజాపాలనతో విమోచన దినోత్సవాన్ని గట్టెక్కించాలని చూస్తోంది. కెసిఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు కేవలం సమైక్యతా దినోత్సవం పేరిట ముగించారు. ఇప్పుడు ప్రజాపాలనతో సాగిస్తున్నారు. నిజానికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, బిజెపిలు రకరకాలుగా దీనిని నిర్వహిస్తున్నారు. కేవలం ముస్లిం ఓటు బ్యాంక్ కోసం బిజెపి, కమ్యూనిస్టులు మినహా మిగతా పార్టీలు నానా గడ్డీ కరుస్తున్నాయనడానికి విమోచన దినోత్సవాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. ఇకపోతే ఏదో రకంగా అటు కేంద్రం ఇటు రాష్ట్రం వేర్వేరుగా... వేర్వేరు పేర్లతో ఉత్సవాలను నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పుకోవాలి. నిజానికి ఇందులో సిగ్గు పడాల్సిన, భయపడాల్సిన పనిలేదు. నిజాం రాజరికం కనుమరుగు చేస్తూ భారత్‌లో విలీనమైన సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరుపుకోవడం నేటివరకు అధికారికం గా జరగలేదు. కేవలం మహారాష్ట్ర, కర్నాటకలో మాత్రమే ఈ ఉత్సవాలు జరిపేవారు. అనూహ్యంగా కేంద్రం విమోచనోత్సవాలు జరపాలని మూడేళ్ల క్రితం నిర్ణయిం తీసుకోవడంతో నాటి తెలంగాణలోని కెసిఆర్ ప్రభుత్వం కూడా దిగిరాక తప్పలేదు. ఈ యేడు యధావిధిగానే బిజెపి తనవంతుగా కార్యక్రమం చేపట్టింది. రాజ్‌నాథ్ సింగ్




ఈయేడు అతిథిగా వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనా దినోత్సవం పేరిట జండావందనం నిర్వహిస్తోంది. కానీ విమోచనోత్సవాలు అని నిర్వహించడం లేదు. కేంద్రం మాత్రం సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో విమోచనోత్సవాలకు శ్రీకారం చుట్టింది. దీంతో హైదరాబాద్ లో జరిగే ఉత్సవాల్లో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జెండా ఎగురేస్తారని అన్నారు. రాంజీ గోండు త్యాగానికి ప్రతిఫలం, తెలంగాణ విమోచన దినోత్సవంగా బిజెపి గుర్తు చేస్తోంది. ఒకే చెట్టుకు అత్యంత కిరాతకంగా వెయ్యి మంది తెలంగాణ ప్రజలను ఒకేసారి ఉరితీసిన నిర్మల్ వెయ్యి ఉరుల మర్రి ఘాతుకంలో అమరవీరులైన మన పూర్వీకులకు నివాళులు అర్పించనుంది. ఆదివాసుల ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్న నిజాం – రజాకార్లపై, బ్రిటిష్ సైన్యం పై గెరిల్లా యుద్ధం చేసిన మన రాంజీగోండు పోరాట స్ఫూర్తిని స్మరించుకుందాం అంటూ పిలుపునిస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొందాం, తెలంగాణ చరిత్రను తరువాతి తరానికి అందిద్దాం. అన్న నినాదంతో బిజెపి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈయేడు కూడా పరేడ్ గ్రౌండ్‌లో విమోచనోత్సవాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభిస్తారు. నిజానికి తెలంగాణ విముక్తి కోసం ఎందరో పోరాడారు. ఎందరో మహిళలు తమ మాన,ప్రాణాలను పోగట్టుకున్నారు. రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలయ్యారు. సర్వస్వాన్ని త్యాగం చేసిన కొమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయ ణరావ్ పవార్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, దాశరథి సోదరులు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ఎందరో మహానుభావులను స్మరించుకునేందుకు ఇదొక సరైన సమయం. అలాగే ఎందరో పోరాట యోధులను గురించి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. త్యాగాలను తర్వాతి తరాలకు అందజేసేలా చరిత్రను అందుబాటులోకి తీసుకుని రావాలి. పాఠ్యాంశాలుగా ముద్రించాలి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోలేక పోవడానికి పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనం తప్ప మరోటి కాదు. ఘనమైన తెలంగాణ చరిత్రను మరుగున పడేసే ప్రయత్నాలు సరికాదు. ఏటా విమోచనోత్సవంపై జోరుగా వాదప్రతివాదనలు, విమర్శలు సాగుతుండేవి. అయినా తెలంగాణలో కూడా విమోచనో త్సవాలకు మోక్షం దక్కలేదు. ఈ ఉత్సవాలు జరపాలంటేనే ఎందుకనో తెలంగాణ పాలకులు విముఖత చూపుతూ వచ్చారు. తెలంగాణకు ముందు విమోచనోత్సవాలకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తప్పమరోటి జరిగేది కాదు. భారతదేశం ఆంగ్లేయుల పాలన నుంచి ఆగస్టు 15, 1947న స్వతంత్ర మైనప్పటికీ నాటి హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇంకా విముక్తి పొందలేదు. స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు దాదాపు 13 నెలలు పట్టింది. ఉక్కు మనిషి, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేకమైన చొరవతీసుకుని హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉపక్రమించడం ద్వారా హైదరాబాద్ సంస్థా నాన్ని భారత్‌లో విలీనం చేశారు. ఈ కారణంగా నిజాం అరాచక పాలననుంచి ప్రజలకు విమోచన లభించింది. నిజానికి రాజకార్ల దాష్టీకం అంతాఇంతా కాదు. దీనిని చరిత్రగతం చేయాల్సి ఉంది. దీనిని మరుగున పడేలా చేశారే తప్ప చరిత్రగా లిఖించలేదు. హైదరాబాద్ సంస్థానంలో అరాచకాన్ని సృష్టించిన ఖాసీం రజ్వీ, లక్షా 50వేల మంది రజాకార్ సైన్యాన్ని ఏర్పాటుచేసి గ్రామాల్లో విధ్వంసం, అరాచకం, దోపిడీ, హత్యాకాండ చేయడం, మహిళలపై అత్యాచారాలు, పురుషులను చంపడం వంటివన్నీ జరిగాయి. దీనిని తెలియచేయడం ఏదో మతానికి వ్యతిరేకం ఎలా అవుతుందో పాలకులు చెప్పాలి. బ్రిటిషర్లు, అంతకు ముందున్న పాలకులు, దేశ విభజన సమయంలోనూ జరిగాయి. ఇవన్నీ తెలుసుకుంటేనే మన చరిత్ర సంపూర్ణం కాగలదు. చరిత్రను విస్మరించిన జాతి లేదా దేశం ముందడుగేయడం కష్టం. బైరాన్‌పల్లి, పరకాల ఘటనలను ఎలా మరచి పోగలం. బైరాన్‌పల్లి ఘటనకు ఇప్పటికీ అక్కడి బురుజులు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందల మందిని నిలబెట్టి రజాకార్లు పిట్టలను కాల్చినట్లు కాల్చారు. ఆ గ్రామాన్ని లూటీ చేసి తమ వికృతరూపాన్ని ప్రదర్శించారు. వరంగల్ జిల్లాలోని పరకాల ప్రజలు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని త్రివర్ణ పతాకాన్ని ఎగరేస్తే నిజాం, రజాకార్లు జీర్ణించుకోలేక హత్యాకాండకు పాల్పడిన చరిత్ర నేటి యువతకు తెలవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ నిజాం పాలనలోని వాస్తవాలను తెలియజేస్తూ, వారి అరాచక పాలన నుంచి విమోచనం కోసం మన పెద్దలు చేసిన పోరాటాన్ని వివరించాలి. ఆనాటి పోరాటాలను స్మరిస్తూ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాల్సి ఉంది. తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిన అవసరం గురించి ప్రజలకు తెలియపరచాలి. తెలంగాణచరిత్ర దేశానికి మొత్తంగా తెలియాలి. ఇక్కడ జరిగిన పోరాటల గురించి తెలియాలి. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ పోరాటలను ప్రజల్లోకి తీసుకుని పోవాలి. అప్పుడే పోరాటవీరుల త్యాగాలకు గుర్తింపు దక్కుతుంది.

## కోట్లల్లో ఆదాయం వస్తున్నా తిప్పలే

**- సామాన్యులకు సకాలంలో దక్కని దర్శనం**

**- విఐపిల సేవలో తరిస్తున్న పాలకవర్గం**



**తిరుమల,సెప్టెంబర్16( వెలుతురు):**

ఎవరు అధికారంలోకి వచ్చినా సామాన్య భక్తుల పేరు చెప్ప, విఐపిల సేవల్లో టిటిడి తరిస్తోంది. భగవంతుడికి –భక్తుడికి మధ్యన టిటిడి గీత గీసింది. అదేపనిగా విఐపిలు రావడం,వారికి సమయంకేటాయించడం పరిపాటిగా మారింది. తిరుమలకు సంబంధించిన అనేక విషయాలను మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు, మాజీ ఇవోలు గతంలో లేవనెత్తిన అంశాలను మూలన పడేశారు. రాజకీయంగా వాడుకోవడం ద్వారా సమస్యను గత టిడిపి ప్రభుత్వం తప్పుదోవ పట్టించింది. జగన్ ఐదేళ్ల పాలనలో అదే జరిగింది. ఇప్పుడుమళ్లా టిడిపి పాలనలోనూ అదే జరుగుతోంది. తిరుమల సమస్యలపై చర్చించకుండా కేవలం పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరించరాదు. ఇదో రకంగా స్వామి భక్తులను అవమానించడం తప్ప మరోటి కాదు. సమస్యను లేవనెత్తితే చర్చించే ధైర్యం చేయలేక పోయారు. ప్రపంచ ప్రఖ్యాత అధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల, తిరుపతి దేవస్థానం (టిటిడి) స్వార్థపూరిత రాజకీయాలకు రణక్షేత్రంగా మారడం అవాంఛనీయం. ప్రజాసేవయే పరమావధిగా ఏర్పాటైన టిటిడి పాలక మండలి తర్వాత తర్వాత కాలంలో రాజకీయ నాయకులకు అధ్యాత్మిక విడిదిగా మారిపోయింది. అన్యమత ప్రచారాలు జరుగుతున్నా తేలికగా తీసుకున్నారు. గతంలో తిరుమల సంపదతో పేదలకు అత్యాధునిక వైద్య సేవలు, ఉన్నత విద్యాసముపార్జన చేసేందుకు వీలుగా విద్యా సంస్థలు నెలకొల్పి మానవ సేవే ప్రధానమని చాటారు. జంతు సంపదను, వృక్ష సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టి పర్యావరణహితానికీ కృషి సల్పారు. అలాంటి విశిష్టత ఉన్న తిరుమల, తిరుపతి దేవాలయాలు ఇప్పుడు రాజకీయ నేతల స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మారిపోవడం దురదృష్టకరం. గతంలో అర్చకులు, సిబ్బంది సంక్షేమం కోసమంటూ ఏర్పాటు చేసిన ధార్మిక పరిషత్‌ను తర్వాత కాలంలో ఎత్తివేశారు. కోటానుకోట్ల సంపదపైనా, బంగారు, వజ్ర తదితర ఆభరణాల నిర్వహణపైనా ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకతపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో భక్తకోటికి తెలియచేయాలి. కోట్లాది రూపాయల సంపాదన పోగుపడుతున్నా అవన్నీ ఎక్కడికి పోతున్నాయో..సరైన రీతిలో వెచ్చిస్తున్నారో తెలియడం లేదు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాల్సింది పోయి వారి దర్శనానికే ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తెచ్చారు. గంటలు, రోజులు తరబడి క్యూలైన్లలో పడిగాపులు పడుతుంటే, విఐపిలు స్వేచ్ఛగా, సులువుగా దర్శనం చేసుకుని వెళుతున్నారు. వీటిని సరిదిద్దుకుని ముందుకు సాగాల్సిన అసవరం ఉంది.

## విమోచనపై మాటమార్చిన నేతలు

**- తెలంగాణ చరిత్రపై వక్రభాష్యం**

**- బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు**

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**



సెప్టెంబర్ 17ను విమోచన దినంగా జరుపుకోవడం తెలంగాణ సాయుధ పోరాటాన్ని గౌరవించడమేనని మాజీ ఎమ్మెల్సీ, బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు. బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా దీనిని విస్మరించిందని అన్నారు. వీరికి కూడా మజ్లిస్ భయం పట్టుకుందన్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదనిసంతుష్టీకరణ చర్యలు తారస్థాయికి చేరుకున్నా యనడానికి కూడా ఇదో నిదర్శనమని అన్నారు. ఉమ్మడి ఏపిలో పాలకుల తీరులోనే కెసిఆర్ వ్యవహరించారు. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి అలాగే వ్యవహరిస్తున్నారు తప్ప తెలంగాణ వ్యక్తిలాగా వ్యవహరించడంలేదన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని మరచిపోయి మాట్లాడుతున్న వారు గతంలో ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకుంటే మంచిదని రామచంద్రరావు అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో విమోనోత్సవాలను జరపాలని డిమాండ్ చేసిన వారు, అధికారంలోకి రాగానే మాట మార్చడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వరకు ఉద్యమాలు చేపట్టామని అన్నారు. చివరకు కేంద్రం ముందుకు రావడంతో విధిలేకనే ఉత్సవాల నిర్వహణకు ముందుకు వచ్చారని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరుల త్యాగాలు వృథా అవుతున్నాయని, వాటి గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరముందని చెప్పారు. అమరుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా చేసి నేటి యువతకు తెలియ జెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. అధికారంలోకి రాగానే విమోచనా దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్న సీఎం కేసీఆర్ మజ్లిస్ పార్టీకి భయపడి మాట మార్చారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస ఆయన దారిలోనే నడుస్తోందని,. ఇలాంటి చర్యలను బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజలను చెట్టుకు కట్టేసి కాల్చడం, మహిళలపై అత్యాచారాలు చేసి బంగారాన్ని, ధనం, ధాన్యాన్ని లూటీ చేయడం వంటి ఘటనలు, రజాకార్ల ఆకృత్యాల గురించి నేటి తరానికి తెలియాల్సి ఉందన్నారు. నిర్మల్‌లో ఆ ప్రాంతంలో నిజాం రాక్షస పాలనకు అడుగడుగునా అడ్డుపడుతున్న రాంజీ గోండు, ఆయన అనుచరులు వెయ్యిమందిని మర్రి చెట్టుకు ఉరితీసిన నిజాం దుర్మార్గాల గురించి కూడా తెలంగాణ విద్యార్థులకు తెలవాల్సిన అవసరం ఉందన్నారు.

అందుకే నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాల ద్వారా చరిత్రను తెలియచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి పది సంవత్సరాలు గడిచినా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకునేందుకు ఇష్టపడటం లేదు. ఇతర రాజకీయ పార్టీలు కూడా విమోచన దినాన్ని జరుపుకునే విషయంలో అర్థంలేని ప్రకటనలు చేస్తున్నాయి. నిజాంకు వ్యతిరేకంగా చాలా మంది ముస్లింలు కూడా పోరాడారని అన్నారు. నిజాంకు కంటిమీద కునుకులేకుండా చేసిన షోయబుల్లాఖాన్‌ను రజాకార్లే క్రూరాతిక్రూరంగా చంపించిన సంగతిని మనం గుర్తుచేసుకోవాలన్నారు.. విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా కుల, మతాలకు అతీతంగా నిజాం, రజాకార్లపై పోరాటం చేసిన వీరులందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని రామచంద్రరావు అన్నారు. వీరందరి కృషి కారణంగానే తెలంగాణ, భారతదేశంలో విలీనమైంది. మన గడ్డమీద త్రివర్ణపతాకం ఎగిరింది. మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయన్నారు. ఇప్పటికైనా బానిసత్వపు ఆలోచనలను విడనాడి మన వాస్తవ చరిత్రను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో ముందుకు కదలాలని అన్నారు.

## కిమ్ తలచుకుంటే పేర్లకు కొదవా?

**- ఐస్‌క్రీమ్పేరునుకడా మార్చేసిన ఘనుడు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్16( వెలుతురు):**



రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా..అన్నది సామెత. ఉత్తర కొరియా ఇందుకు అతీతంకాదు. ఎందుకంటే ఇక్కడి నయింత ఏది చెబితే అదే జరుగుతుంది. జరిగి తీరాలి కూడా. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు ఎందుకో ఐస్ క్రీమ్ మీద కోపం వచ్చింది. వెంటనే ఓ నిర్ణయం తీసుకొన్నారు. ఏకంగా దాని పేరునే మార్చేశారు. సాంస్కృతిక నియంత్రణ కోసం ఈ నిర్ణయం తీసుకొన్నట్లు– అక్కడి ప్రభుత్వం చెబుతోంది. అంతేకాదు.. పనిలోపనిగా మరికొన్ని ఫేమస్ పదార్థాల పేర్లను కూడా మార్చేశారు. ప్రపంచవ్యాప్తంగా 'ఐస్‌క్రీమ్' అనేది ఎక్కడికి వెళ్లినా గుర్తుపట్టే పేరు. కానీ, ఉత్తరకొరియా అధినేత మాత్రం ఈ పేరు వల్ల విదేశీ ప్రభావం ప్రజలపై పడుతుందని అనుమానించారు. దీంతో ఉత్తరకొరియా భాషలో 'ఎసుకిమో'గా మార్చేశారు. లేకపోతే ఇయోరియెంబోసెంగిగా పిలవాలని మినహాయింపు ఇచ్చారు. వీటికి 'ఐసు మిఠాయి' అని అర్థం. ఈ విషయాన్ని డెయిలీ ఎన్‌కే పత్రిక పేర్కొంది. దక్షిణ కొరియా, పశ్చిమదేశాల పదాలను దేశ భాష నుంచి తొలగించడమే దీని లక్ష్యంగా వెల్లడించింది. ప్రస్తుతం ఉత్తరకొరియా లోని టూర్ గైడ్లకు వాన్సన్ సహా పలు ప్రదేశాల్లో మూడు నెలల శిక్షణ ప్రారంభించింది. దానిలోభాగంగా విదేశీ పర్యాటకులతో మాట్లాడే సమయంలో కూడా ఎటువంటి ఇంగ్లిష్ పదాలు రాకుండా ఎలా జాగ్రత్త తీసుకోవాలో వెల్లడించారు. అయితే విదేశీ పర్యాటకులతో అలా ఎలా మాట్లాడతామంటూ వారు తలలు పట్టుకొంటున్నారు. కిమ్ చెప్పాక చేయడం మినహా మరో ఆప్షన్ లేకపోవడంతో.. శిక్షణలకు హాజరవుతున్నారు. సాధారణంగా ఆర్కిటిక్, అలాస్కా, కెనడా, గ్రీన్‌ల్యాండ్, సైబీరియాల్లో ఎస్కిమో అనే జాతి ఉందని మనకు తెలుసు. తాజాగా 'ఎసుకిమో' పదం కూడా దానిని పోలి ఉండటంతో గందరగోళం నెలకొంది.మరికొన్ని పదార్థాల పేర్లలో కూడా మార్పులు..ప్రపంచవ్యాప్తంగా సుపరిచితమైన హామ్‌బర్గ్ పేరును కూడా కిమ్ మార్చేశారు. దీనిని డాజిన్–గోగి గియోపాంగ్‌గా పిలవాలని ఆదేశించారు. గ్రౌండ్ బీఫ్‌తో రెండు బ్రెడ్లు అని అర్థం. కారియోకి మెషిన్ల పేరును కూడా ఉత్తరకొరియా నియంత మార్చేశారు. పర్యాటకులు తమ దేశంలో ఉన్నప్పుడు వారు దక్షిణ కొరియా పదాలు వాడకుండా నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇటీవల కంగ్వాన్ ప్రావిన్స్‌లోని బీచ్ వద్ద వాన్సన్ అనే విలాసవంతమైన రిసార్ట్ హబ్‌ను అభివృద్ధి చేశారు. దీని అధికారి ఒకరు మాట్లాడుతూ విదేశీ ప్రభావం నుంచి ఉత్తర కొరియా వాసులను రక్షిస్తూ టూరిజాన్ని ప్రమోట్ చేయడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. గైడ్లకు ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 21న మొదలైంది. దీనిని ఆ దేశ వర్కర్స్ పార్టీ క్యాడర్ డిపార్ట్‌మెంట్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. వాన్సన్ అంతర్జాతీయ టూరిజమ్ హబ్‌గా మారుతుందని కిమ్ భావిస్తున్నారు.

## మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్ మెన్ లారీ లోడ్ యూరియా ఎత్తుకొని పోయాడని బద్నాం చేసిన బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ వెంటనే నాగు నాయక్ కు క్షమాపణ చెప్పాలి.

- బీసీ నేత లింగంగౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** యూరియా సరఫరా విషయంలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే గన్ మెన్ లారీ లోడ్ యూరియా ఎత్తుకొని పోయాడు అని కేటీఆర్ అనడం సిగ్గు చేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ ఏదో ప్రత్యక్షంగా నాగు నాయక్ యూరియా తీసుకపోతే చూసినట్లు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ అనవసరంగా కావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్ మెన్ నాగు నాయక్ ను బద్నాం చేసినందుకు వెంటనే నాగు నాయక్ కు క్షమాపణ చెప్పాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

## అంబర్పేట్ లో బతుకమ్మ కుంట లో బతుకమ్మ ఆడటం కోసం సుందరి కరణ వి. హనుమంతరావు

**- గత 30 ఏళ్ల క్రితం ఈ బతుకమ్మ కుంట లో మేము ఈత కొట్టాం వి. హనుమంతరావు**



**బషీర్ బాగ్ వెలుతురు 16 సెప్టెంబర్:** కేసీఆర్ కు కూడా అనేక సార్లు బతుకమ్మ కుంట పునరుదరించాలి అని అనేక సార్లు వేడుకున్న.కానీ పట్టించుకోలేదు. తెరాస నేతలు ఈ బతుకమ్మ కుంట ను కబ్జా చేశారు. రేవంత్ రెడ్డి,హైడ్రా వల్ల బతుకమ్మ కుంట కాపాడారు. కవిత లండన్ లో బతుకమ్మ ఆడింది..కానీ ఈ బతుకమ్మ కుంటలో కనిపించలేదు. ఈ నెల 25న బతుకమ్మ కుంట ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. మహిళలు అందరూ ఈ ఏడాది బతుకమ్మ కుంట లోనే బతుకమ్మ ఆడతారు. అందరూ మహిళలు ఇక్కడికి వచ్చి బతుకమ్మ ఆడాలి.పార్టీలకు అతీతంగా ఇక్కడికి వచ్చి బతుకమ్మ ఆడాలని కోరుతున్నాం. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతు బతుకమ్మ కుంట ను అందుబాటులోకి తీసుకురావడం ఆనందం గా ఉందన్నారు ఈ నెల 25న రేవంత్ రెడ్డి బతుకమ్మ కుంట ప్రారంభిస్తారు. GHMC అనేక ఏర్పాట్లు బతుకమ్మ కోసం చేస్తున్నాం స్వచ్ ఆటోల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, హైడ్రా కమిషనర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, హెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, వి. హనుమంతరావు, శ్రీకాంత్ గౌడ్, దీపి రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 19న హలో లంబాడి-చలో హైదరాబాద్

**- లంబాడిల ఆత్మగౌరవ సభకు బంజారా సోదరులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి**

**- లంబాడిల ఆత్మగౌరవ వేదిక సమన్వయకర్త, ఓయూ విద్యార్థి నాయకులు విజేందర్ పవార్**



**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 16 :** ఈనెల 19వ తేదీన ఉదయం 10గంటలకు ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబోయే లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని లంబాడిల ఆత్మగౌరవ వేదిక సమన్వయకర్త, ఓయూ విద్యార్థి నాయకులు విజేందర్ పవార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల వద్ద ఆత్మగౌరవ వేదిక నాయకులు రమేష్ రాథోడ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ.. లంబాడీలు, గిరిజనుల మీద కొంతమంది కావాలని దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆత్మగౌరవంతో బతుకుతున్న లంబాడి, గిరిజనుల మధ్య కొందరు అవాస్తవాలు చెబుతూ వారి మధ్య గొడవలు పెట్టే విధంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. లంబాడీల మీద చేస్తున్న అవాస్తవాలను ప్రతీ ఒక్క లంబాడీ బిడ్డ తిప్పి కొట్టాలన్నారు. తెల్లం వెంకట్రావు, సోయం బాపూరావు లంబాడీలను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. లంబాడీల ఆత్మగౌరవ సభకు ఇంటింటి నుంచి బంజారా సోదరులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

## అమెరికాలోని కేటలీనా చానల్ ను ఈదిన తల్లీకొడుకులు..

**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 16:**



అమెరికాలోని లాస్ఏంజెల్స్ లో ఉన్న కేటలీ నా చానల్ ను హైదరాబాద్ బర్కత్ పుర కు చెందిన గంధం క్వీనీ విక్టోరియా, ఆమె కుమారుడు స్టీపె న్ కుమార్ విజయ వంతంగా ఈది కొత్త చరిత్రను సృష్టించారు. మాద కద్రవ్యాలకు వ్యతిరేకంగా డ్రగ్స్ పై యువతకు అవగాహన కల్పిం చాలనే లక్ష్యంతో తల్లీకొడుకులు ఈ సా హస యాత్ర నిర్వహించారు. ఈ నెల 7న తల్లీ కొడుకులు అమెరికాకు వెళ్లి ఈ కేట లీనా చానల్ ను ఈదారు. కాలిఫోర్నియా పశ్చిమతీరం కేటలీనా ద్వీపానికి మధ్య 42 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఆమె రికా కాలమానం ప్రకారం గత ఆదివారం రాత్రి 10.48 నిమిషాలకు ఈత ప్రారంభిం చి మరు సటి రోజు ఉదయం 11.30 నిమి షాలకు పూర్తి చేసినట్లు గంధం క్విని విక్టో రియా ఆమెరికా నుంచి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సాహసయాత్ర నిర్వహించడానికి మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఎంతో ప్రోత్సహించారని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో మరికొన్ని చానల్స్ ను ఈది రికార్డు స్థాపించడమే లక్ష్యమని ఆమే పేర్కొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించిన డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



**మంచాల వెలుతురు సెప్టెంబర్16:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంచాల వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం అవుతున్న కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించిన డిసిసిబి చైర్మన్, కొత్తకుర్మ సత్తయ్య ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం కూరగాయల మార్కెట్ నిర్మించడం చాలా సంతోషకరం అన్నారు త్వరలో సహకార సంఘాల ద్వారా పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం అని అన్నారు రైతులు సహకార సంఘాల్లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి సహకార సంఘం బలోపేతానికి ప్రతి ఒక్క రైతు కృషి చేయాలి మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలి అని అన్నారు ఆరుట్ల గ్రామంలో నిర్మాణం అవుతున్న కూరగాయల మార్కెట్ ను ఈ నెలాఖరులో ప్రారంభిస్తామ న్నారు రైతులం దరూ సద్వినియోగం చేసుకోవా లి అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు ఈ కార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి డైరెక్టర్ జెనిగె వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీరాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్, ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల బాషా మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య అంతటి రాజుగౌడ్, చిందం ఐలయ్య కావలి దర్శన్ మహమ్మద్ అష్రఫ్ దాసరమోని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్లలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులు

**- ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి**

**- మంచాల గృహనిర్మాణ శాఖ ఏఈ రామచంద్రయ్య**



**మంచాల వెలుతురు సెప్టెంబర్16:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆరుట్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులలతో కలిసి పరిశీలించిన మంచాల మండలం గృహ నిర్మాణ శాఖ ఏఈ రామచంద్రయ్య అనంతరం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులతో చెప్పారు బీస్ మెంట్ స్లాబ్ లెవెల్ వరకు నిర్మాణం చేసిన లబ్ధిదారుల బిల్లులు చేస్తాం అని అన్నారు ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ మాట్లాడుతూ ఇప్పట్టి వరకు మంజూరు అయిన ఇందిరమ్మ లబ్ధి దారులు త్వరగా పూర్తిచేయాలి అన్నారు ఇప్పుడు మొదలు పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయినా తరువాత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం అని అన్నారు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ప్రతి లబ్ధిదారుడు ఇంటి పనులు మొదలు పెట్టాలి అన్నారు నిర్మాణం పనులు మొదలు పెట్టకపోతే బిల్లులు రావు అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం ప్రతి పేదవాడి కండ్లలో ఆనందం చూడాలి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదవాడు ఉండకూడదు అనే ఉద్దేశంతో ఆనాడు స్వర్గీయ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గరీబ్ హటావో అనే నినాదంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి పేదలకు పంపిణీ చేసింది అన్నారు గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్గీయ ముఖ్యమంత్రివైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ఇందిరమ్మ ఇండ్లపథకం ప్రవేశపెట్టి ఎంతోమంది పేదలకు ఇండ్లు మంజూరు చేసి కాంగ్రెస్ పార్టీకి మంచిపేరు తెచ్చాడు అన్నారు నేడు అదే బాటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టాడు అన్నారు అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యంగా ఉండాలి కాంగ్రెస్ పార్టీప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం అన్నారు ఈకార్యక్రమంలో ఆరుట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేష్ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కంబాలపల్లి బుగ్గ రాములు బుట్టి కృష్ణ ముదిరాజ్ మార బౌరమ్మ లక్ష్మణ్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## తాళ్ల రాంపూర్ లో గౌడుల పై పెత్తందార్ల దౌర్జన్యం నశించాలి

**- వారిని కఠినంగా శిక్షించాలి: కేజీకేఎస్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** కల్లుగీత కార్మికులకు ఉపాధి కలిగించే చెట్లను నరికేయడం చట్టప్రకారం నేరం అన్నందుకు నిజామాబాద్ జిల్లా తాళ్ళ రాంపూర్ గ్రామంలోని గౌడ కులానికి సంబంధించిన వారందరిపై దౌర్జన్యంగా దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. ఇటీవల విడిసి పేరు తో గౌడ కులానికి చెందిన వారిని గ్రామ బహిష్కరణ చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయగా అధికారులు దిగి వచ్చి వీడీసీ ని రద్దు చేశారు. ఇది చట్ట ప్రకారం నేరం అని చెప్పారు.ఇది జీర్ణించుకోలేని పెత్తందారులు మళ్లీ దాడి చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని అక్కడ శాంతి భద్రతలు కాపాడాలి. గౌడులకు రక్షణ కల్పించాలి. లేని పక్షం లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతాం. మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు. కల్లు గీత కార్మిక సంఘం కేజీకేఎస్.

## అణగారిన ప్రజల హక్కులు,అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి బొజ్జా తారకం.

- బీసీ నేత లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** అణగారిన ప్రజల ఆశాజ్యోతి,పౌర హక్కుల నాయకుడు,కవి,రచయిత బొజ్జా తారకం 9వ వర్ధంతి సందర్భంగా ఆయన పీడిత ప్రజల కోసం జీవితాంతం చేసిన కృషిని గురించి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కొనియాడారు.ముఖ్యంగా భూమి పీడిత ప్రజలకు దక్కితేనే వారికి రెండు పూటలా భోజనంతో పాటు సమాజంలో గౌరవ మర్యాదలు దక్కుతాయని భావించేవారు. చుండూరు, కారంచేడు, లక్ష్మీపేట ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ ముందుండి నడిపారని హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టి అనేక ప్రజా ఉద్యమాలు దళిత ఉద్యమాలలో పాల్గొని ప్రజలను చైతన్యం చేయడంలో కీలకపాత్ర వహించారు ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపాలని శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు శాంతి చర్చల్లో ఇతను కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. బొజ్జా తారకం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా లింగం గౌడ్ అన్నారు.

## కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలాతాలే జూబ్లీహిల్స్‌లో పునరావృతం అవుతాయి

**- కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మీడియాతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** బి ఆర్ ఎస్ పార్టీలో అంతర్గత కలహాలు, కుటుంబ కలహాలతో కలవరపడుతున్న కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని ముందే ఊహించి అవినీతి సొమ్ముతో పెట్టిన పేపర్, టీవీ, సోషల్ మీడియాల ద్వారా ఫేక్ ప్రచారాలతో ప్రజలను గందరగోళ పరుస్తున్న నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు ఈరోజు అసెంబ్లీలోని సి యల్ పి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మీడియా మిత్రులతో మాట్లాడుతూ కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలితాలే జూబ్లీహిల్స్ లో పునరావృతం అవుతాయని, సెంటిమెంట్ కంటే అభివృద్ధికే జూబ్లీహిల్స్ ఓటర్లు పట్టం కడతారని, కంటోన్మెంట్ ప్రజలు కూడా అభివృద్ధికే పట్టం కట్టారని, గౌరవ ముఖ్యమంత్రి గారు కంటోన్మెంట్ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున నిధులు కేటాయిస్తుండడంతో అభివృద్ధి చేస్తున్నామని , విజ్ఞులైన జూబ్లీహిల్స్ ఓటర్లు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించుకుంటే గత 10 ఏళ్ళుగా కుంటుపడిన అభివృద్ధిని పరుగులెత్తిస్తామని చెప్పారు.

## జీవో-150 కారణంగా ప్రమాదంలో నీట్ విద్యార్థుల భవిష్యత్తు

**- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:** తెలంగాణ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మంగళవారం రోజున సచివాలయం మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, జీవో-150 కారణంగా తెలంగాణ విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. "చిన్న కారణాల వల్లే మా తెలంగాణ విద్యార్థులు స్థానికత కోల్పోయే ప్రమాదం నెలకొంది. పదో తరగతి వరకు ఒక చోట చదివి, ఇంటర్ మరోచోట.

## ఆరుట్ల గ్రామంలో శ్రమదానం చేసిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్



**మంచాల వెలుతురు సెప్టెంబర్16:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని లేని నగర్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ప్రమాదకరంగా మారినగడ్డిని శ్రమదానంచేసి తొలగించిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజా ప్రతినిదులు లేక పోవటంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడి ఉంటుంది అన్నారు గ్రామాల్లో లైట్లు సక్రమంగా లేవు పట్టించుకునే నాథుడే లేడు అన్నాడు వెంటనే ఆరుట్ల గ్రామ ప్రత్యేక అధికారి స్పందించి గ్రామ వీధుల్లో చెత్తాచెదారం లేకుండా క్లీన్ చేయించాలి గ్రామాల్లో వీధిలైట్లు వేయించా లిఅన్నారు శ్రమదానం కార్యక్రమంలో విద్యుత్ ఆరుట్ల అసిస్టెంట్ లైన్ మెన్ పంది అనిల్ శేఖర్ రెడ్డి ఉప్పల పాపయ్య బద్దు వెంకటయ్య జోగు మైసయ్య తదితరులు పాల్గొన్నారు

## విష సర్పాలకే ప్రాణ రక్షణ కల్పిస్తున్న స్నేక్ వెంకట్

**- పాములు ప్రకృతికి ఎంత అవసరము**

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 16**



పాములు ప్రకృతికి ఎంతో అవసరం అని స్నేక్ వెంకట్ తెలిపారు.మండలంలోని జనంపల్లిలో ఓ ఇంటి వద్ద ప్రవేశించిన నాలుగు అడుగుల తాసు పామును వెంకటేష్ సమాచారం మేరకు గ్రామానికి వచ్చి పామును మంగళవారం పట్టుకొని అడవి ప్రాంతంలో వదిలేశాడు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి పాములను చంపడం కాకుండా వాటికి ప్రాణం బిక్ష పెట్టాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. బంధించిన పాములను జనావాసాలకు దూరంగా వదిలిపెడతామని తెలిపారు. సంఘటన జరిగిన సందర్భంలో పలువురు వెంకటేష్ ని అభినందించారు. తనను సంప్రదించాలంటే ఈ నెంబర్ కు 7995588770 సంప్రదించాలని వెంకటేష్ కోరారు.

## పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం వారి కార్యవర్గ సమావేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 16**

పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం వారి కార్యవర్గ సమావేశం రామన్నపేట మండలం లో శ్రీ చెన్నకేశ్వర స్వామి దేవాలయంలో అధ్యక్షులు కర్నాటి నరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేయనైనది.ఇట్టి సమావేశంలో సంఘం యొక్క అభివృద్ధి గూర్చి , పద్మబ్రాహ్మణుల యొక్క పురోహితము,మంత్రపఠన సాధన విధానాల గూర్చి చర్చించనైనది.పద్మబ్రాహ్మణుల మంత్రపఠనంలో స్వరయుక్తముగా పఠించేందుకు మెలుకువలు తెలియచేయనైనది. రానున్న రోజులలో పురోహితమును చాలా ప్రాంతములలో పద్మబ్రాహ్మణులు అందరికీ అనుకూలంగా,నిర్వహించాలని తీర్మానించనైనది.ఈ సమావేశంలో జిల్లా సంఘ భవన నిర్మాణము కొరకు ప్రభుత్వాన్ని కోరనైనది. ఈ కార్యక్రమంలో ఆయిటిపాముల భీమయ్య ప్రధాన కార్యదర్శి,మిర్యాల కార్తీక్ కుమార్,గుర్రం కృష్ణ, చలమల్ల ధనుంజయ, అప్పం ఫృధ్వీరాజ్, పసునూరి నిత్యానందం, గౌరవ సభ్యులుగా అవురేణి కృష్ణ శాస్త్రి,వర్కాల శ్రీహరి, వర్కాల సత్యనారాయణ ఏలె వాసుదేవ్ మండల సభ్యులు,రవ్వ పాండు,జెల్ల నిరంజన్,పెండెం రవీందర్, వనం వెంకటేష్,జెల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనది



- ఎంపీడీవో గంగుల యుగేందర్ రెడ్డి.

**మునుగోడు,సెప్టెంబర్ 16 (వెలుతురు):**

నాటికి నేటికి సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని ఎంపీడీవో గంగుల యుగంధర్ రెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమానికి ఎంఈఓ తల్లమల్ల మల్లేశం, జిహెచ్ఎం కే.బాల ప్రసాద్, వి.రాధిక,సిహెచ్ వెంకటయ్య,జె బాలరాజు తో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు తీరం దాసు సత్తయ్య,మండల అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ పాషా,ప్రధాన కార్యదర్శి మేకల అన్నపురెడ్డి,టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ, మండల అధ్యక్షుడు రాములు ప్రధాన కార్యదర్శి పెరిక నరసింహ, టిపిటిఎఫ్ జిల్లా బాధ్యులు రత్నయ్య మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నటరాజ్ వెంకట్ రెడ్డి,మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**మునుగోడు, సెప్టెంబర్ 16 (వెలుతురు):**

మండల కేంద్రంలోని 2వ వార్డ్ గాంధీనగర్ కాలనీకి చెందిన మెట్టు మారమ్మ మృతి చెందారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా నగదు రూ.5000 అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో సేవ కార్యక్రమాలు చేపడుతున్నానని అన్నారు.మెట్టు మారమ్మ మన మధ్యలో లేకపోవడం బాధాకరం అని వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో యరసాని సైదులు,యరసాని యాదయ్య,యాట గౌరయ్య,మెట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి,వరి పంటలను సందర్శించిన వ్యవసాయ అధికారిని

**మునుగోడు, సెప్టెంబర్ 16 (వెలుతురు):**



మండల పరిధిలోని పలివెల క్లస్టర్ పలివెల గ్రామం లో మండల వ్యవసాయ అధికారిని ఎస్.పద్మజ రైతుల యొక్క పత్తి,వరి పంటలను మంగళవారం సందర్శించారు. ప్రత్తి లో తామర పురుగు, ఎర్ర నల్ల,పచ్చ దోమ, రసం పీల్చే పురుగులు, కాయ కుళ్ళు తెగులు ను గుర్తించి వాటి నివారణ కొరకు ఇథియాన్ 40% ం సైపర్మెత్రిన్ 5% మందు ఏ 2.5 మి.లీ.లు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి, వేప నూనె 1500 ppm ఏ 5 మి.లీ. లు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోమని సూచించారు.వేప నూనెతో పురుగుల జీవిత చక్రము గుడ్డు దశలోనే అరికట్ట వచ్చని తెలిపారు.వరి పంటలో ఆకు ముడతను గమనించి రైతులు తీసుకోవాల్సిన తగు నివారణ చర్యల గురించి వివరించారు. పురుగు మందుల ను ఎప్పుడూ కూడా మోతాదు కు మించి, ఇతర బయోలతో కలిపి వాడొద్దని వాడితే పంటల పై ప్రభావం పడుతుందన్నారు. వారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి కె. నిఖిల్ కుమార్, రైతులు గోసుకొండ మల్లేష్, మాదగోని లింగయ్య, గోసుకొండ నరసింహ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 న ప్రతి బూత్ లో జాతీయ జెండా ఎగురావేయాలి

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 16:**

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున సేవా పక్షం -2025 కార్యశాల (15 రోజులు)చౌటుప్పల మున్సిపాలిటీలో గల పిబి గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సేవా పక్వార్డు మున్సిపల్ కన్వీనర్ ఆలె చిరంజీవి సేవా పక్షం -



2025 సంబంధించిన కార్యక్రమాల గురించి దిశా నిర్దేశం చేయడం జరిగింది మొదటగా భారత ప్రధానమంత్రి జన్మదిన పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు ఆత్మ నిర్భర్ భారత్



వికసిత్ భారత్ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది నమో , యువ మోర్చా ఆధ్వర్యంలో 2- 3 కి.మీ మారథాన్ నిర్వహించాలి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగోని శంకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు సన్మానం దివ్యాంగులకు ఉపకరణల పంపిణీ కార్యక్రమాలు చేయాలని చెప్పడం జరిగింది అసెంబ్లీ కన్వీనర్ దూడల్ బిక్షం గౌడ్ ప్రతి బూత్ స్థాయిలో మొక్కలు నాటడం దీన్ దయాల్ జీ సందర్భంగా మున్సిపల్ కేంద్రంలో నివాళులర్పించడం కార్యక్రమం చెయ్యాలని పిలుపునిచ్చారు అదేవిధంగా మున్సిపల్ మున్సిపల్ కేంద్రంలో స్వచ్ఛభారత్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీ స్థాయిలో చిత్రలేఖనం నిర్వహించాలి అని అన్నారు యొక్క కార్యక్రమంలో ముత్యాల భూపాల్ రెడ్డి మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు చినుకుని మల్లేశం యాదవ్ దిండు భాస్కర్ ఊడుగు వెంకటేశం గౌడ్ కాసుల వెంకటేశం గౌడ్ కడారి ఐలయ్య బత్తుల జనార్ధన్ చికూరి ప్రభాకర్ బుడ్డ సురేష్ తోకల సాయి వరగంటి భాను ప్రకాష్ గౌడ్ ఎల్లంకి పాండు రమాకాంత్ జి. వేణు శివప్రసాద్ పల్లె వెంకట్ రెడ్డి శేఖర్ రెడ్డి అంజిరెడ్డి మల్లేశం రాజశేఖర్ రమేష్ చెన్నబోయిన శివప్రసాద్ కంచర్ల వెంకట్రెడ్డి అమృతం దశరథ నేదునూరి గణేష్ జట్ట ముత్యాలు జగన్ భూత్ అధ్యక్షులు బొల్లముని శ్రీశైలం సిలివేరు సురేష్ కడ్తాలా శ్రీనివాస్ దామోదర్ రెడ్డి కనకాచారి తదితరులు పాల్గొన్నారు



## ఎస్ జి.ఎఫ్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించిన తిమ్మాపూర్ మండల శ్రీ చైతన్య డిఫెన్స్ , స్పోర్ట్ అకాడమీ విద్యార్థులు

**తిమ్మాపూర్ వెలుతురు సెప్టెంబర్ 16:**

15.09.2025 సోమవారం రోజున నిర్వహించిన అండర్-17 బాలుర విభాగం వాలీబాల్ టోర్నమెట్లో జిల్లాకు చెందిన 16-మండలాలు పాల్గొనడం జరిగింది. అందులో తిమ్మాపూర్ మండలానికి చెందిన శ్రీ చైతన్య డిఫెన్స్ , స్పోర్ట్ అకాడమీ 6 విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి తిమ్మాపూర్ మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడం జరిగింది. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత (చైర్మెన్) యం. రమేష్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఇదే క్రీడా స్ఫూర్తితో మా విద్యార్థులు దాదాపు 16 రకాల క్రీడా విభాగాలలో పాల్గొంటారని తద్వార మండలానికి జిల్లాకు మరియు రాష్ట్రానికి నేతృత్వం వహిస్తారని



ఆశిస్తున్నాము. ఈ సందర్భంగా జాతీయ స్థాయి కోకో కి ఎంపికైన విద్యార్థి కె. రాహుల్ని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. రాహుల్ ఈ నెల 29న మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో జరగబోయే 13వ జాతీయ పోటీలలో పాల్గొంటున్నాడు. అతనికి ప్రోత్సాహకంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని



రమేష్ రెడ్డి నగదు బహుమతి ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, డిఫెన్స్ కాలేజి ప్రిన్సిపల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, ఎజియం శ్రీనివాస్ మరియు కోచ్ లు శివరామక్రిష్ణ, సందీప్ లు పాల్గోనడం జరిగింది.

## పర్యావరణం కాపాడటంలో మేమే ముందుంటాం - యంగ్ ఎర్త్ లీడర్స్

**- వెల్లంకి పాఠశాలలో పలు అభివృద్ధి పనులు**

**- ప్రారంభించిన సిజిఅర్ సంస్థ ప్రతినిధులు**




రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 16

పర్యావరణం కాపాడటంలో మేమే ముందు ఉంటామనీ వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సహకారంతో పాఠశాల ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మంగళవారం నాడు అట్టి పనులను సంస్థ ప్రతినిధి అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య హాజరై పనులను పరిశీలించి, విద్యార్థుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థ చేసిన వాటర్ హార్వెస్టింగ్ ఫిట్, మెడిసినల్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్ పనుల ఉపయోగం, విధానం విద్యార్థులకి తెలియజేశారు. రానున్న కాలంలో మొక్కలు పెంచని యడల ఎంతో ప్రమాదం పొంచి ఉన్నదని, ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల ప్రాంగణం, ఇంటి వద్ద, కుటుంబ చేత మిత్రులు, బంధువులకు తెలియజేసి వెల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అలా చేసినప్పుడే ప్రమాదం నుండి బయట పడవచ్చని అన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులు పర్యావరణం కలుషితం అయి ఎన్నో రోగలపాలు అవుతున్నమని, దాని నుండి బయటపడాల్సిన అవసరం ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ కో- ఆర్డినేటర్ బత్తుల గణేష్, అధ్యాపక బృందం, విద్యార్డులు పాల్గొన్నారు.

## శివన్న గూడెం రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ నెట్వర్క్ పై

# సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయండి

**- శివన్న గూడెం కి నిరంధించే ఎదుల్ల రిజర్వాయర్ వద్ద ఎఫ్ ఎస్ ఎల్ (Full level Supply) పెంచకుండా కిందికి ఉండేలా చూడండి**

**- నారాయణపూర్ చౌటుప్పల్ మండలాలతోపాటు మల్కాపురం ఇండస్ట్రియల్ పార్క్ కి త్రాగునీటి కోసం శాశ్వత పరిష్కారం**

**- చౌటుప్పల్ మండల సాగునీటి కోసం చిన్న మూసి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వెంటనే మొదలు పెట్టాలి**

**- శివన్న గూడెం రిజర్వాయర్ పనుల సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**

మునుగోడు నియోజకవర్గం లోని మర్రిగూడ మండలం శివన్నగూడ రిజర్వాయర్ పనులపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులతో హైదరాబాదులోని తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శివన్న గూడెం రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయినప్పటికీ రిజర్వాయర్ కింద డిస్టిబ్యూషన్ నెట్వర్కు పనులు మొదలుకాలేదని వెంటనే రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ పై సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు... శివన్న గూడెం రిజర్వాయర్ ని నిర్మిస్తున్నప్పటికీ ఆ రిజర్వాయర్ లోకి ఎక్కడినుండి నీటిని తరలించాలని ఆలోచన గత ప్రభుత్వం చేయలేదని గుర్తు చేశారు... తాను చొరవ తీసుకొని సంబంధిత మంత్రి, నీటి పారుదల శాఖ ఉన్నత స్థాయి అధికారుల తో చర్చించి మహబూబ్నగర్ జిల్లాలోని ఎదుల్ల రిజర్వాయర్ నుండి శివన్నగూడ రిజర్వాయర్ కు నీటిని తరలించేలా 1800 కోట్ల రూపాయలతో పరిపాలన అనుమతులు తీసుకొచ్చామన్నారు... ఎదుల్ల రిజర్వాయర్ నుండి శివన్నగూడెం రిజర్వాయర్కు నీటిని తరలించే పాయింట్ వద్ద ఎఫ్ ఎస్ ఎల్ (Full supply లెవెల్, పూర్తి సరఫరా స్థాయి) 437.375 గా నిర్ధారించగా.. అక్కడి ఇంజనీర్లు దానిని 440 ఎఫ్ ఎస్ ఎల్ గా ఉండాలని పట్టుబడుతున్నారని గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ఎట్టి పరిస్థితుల్లో 440 ఎఫ్ ఎస్ ఎల్ కి ఒప్పుకునేది లేదని, నిర్ణయించిన 437 ఎఫ్ఎస్ఎల్ నుండే నీటిని తరలించేలా చర్యలు తీసుకువాలని అధికారులను ఆదేశించారు అవసరమైతే నేను ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.. నియోజకవర్గంలోని నారాయణపూర్ చౌటుప్పల్ మండలం ప్రజల తాగునీటితో అవసరాలతో పాటు మల్కాపురంలో తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ(TGIIC) ఏర్పాటుచేసిన పారిశ్రామిక పార్కు కూడా తాగునీటిని అందించేలా శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటికే శివన్న గూడెం రిజర్వాయర్ నుండి తాగునీరు అందించడానికి సుమారు 1200 కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధం చేశారు.. ఆ పనుల పురోగతిపై చర్చించారు.. వర్షాకాలంలో మూసీ నదిలోకి వృధాగా వెళుతున్న జలాలను ఒడిసిపట్టి వాటిని చౌటుప్పల్ మండల



సాగునీటి అవసరాల కోసం వాడుకోవడానికి చిన్న మూసి నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కోసం సర్వే చేసి డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు. చిన్న మూసి వాగు నుండి మూసి నదిలోకి వృధాగా వెళ్తున్న వర్షపు నీరును లిఫ్ట్ చేసినట్లయితే చౌటుప్పల్ మండలం లోని కొన్ని గ్రామాలు సస్యశ్యామలమయ్యే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజనీర్లు ఫోరం సభ్యులు గౌరవ ఎమ్మెల్యే గారికి తెలపడంతో వెంటనే పనులు మొదలు పెట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు ఈ సమీక్ష సమావేశంలో మాల్ ఎస్ ఈ. శ్రీనివాసరెడ్డి, మర్రిగూడెం ఈ ఈ రాములు, చండూరు డి ఈ కాశీం లతో పాటు తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులు శ్యాం ప్రసాద్ రెడ్డి, సత్తిరెడ్డి ఇంద్రసేనారెడ్డి లు పాల్గొన్నారు...


## యల్.ఓ.సి చెక్కును అందజేసిన నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ



**తిరుమలగిరి (సాగర్), వేలుతురు (న్యూస్) సెప్టెంబర్ 16:**

ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం మిర్యాలగూడ నందు నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి(సాగర్)మండలం బోయగూడెం గ్రామానికి చెందిన కలసాని మారయ్య తండ్రి పిచ్చయ్య నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక నాయకులు ఎమ్మెల్సీ దృషికి తీసుకురావడంతో వారికీ ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా 1.5(ఒక లక్ష ఏభై వేల రూపాయలు) చెక్కును మంజూరు చేయించటం జరిగింది. మంగళవారం రోజున LOC చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసిన నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు యం.సి కోటిరెడ్డి ఈ సందర్భంగా LOC నీ మంజూరు చేయించిన ఎమ్మెల్సీ ని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తో పాటు తిరుమలగిరి(సాగర్) మండల బి.ఆర్.యస్ యూత్ అధ్యక్షుడు గౌరు శ్రీనాథ్, హాలియా పట్టణ బి.ఆర్.యస్ పార్టీ యువ నాయకులు బొడ్డుపల్లి మురళి,ఉన్నారు.

## మృతుడు కేళావత్ శ్రీను నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక భరోసా కల్పించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న



**తిరుమలగిరి( సాగర్), వెలుతురు (న్యూస్) సెప్టెంబర్, 16:**

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సాగర్ మండలం, సుంకిశాల తండా వాస్తవ్యులు అయినటువంటి కేళావత్ శ్రీను నాయక్ సాగర్ కాలువలో జారీ పడి కనిపించకుండా పోయాడు. 4 రోజులు తర్వాత అల్వాల్ కాలువ దగ్గర శవం అయి తేలాడు. సుంకిశాల తండా తాజా మాజీ సర్పంచ్ కేళావత్ జ్యోతి రామకృష్ణ నాయక్ ద్వారా విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న నిన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఆర్థికంగా ఎంతో కొంత ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. వీరితో పాటు ఈ కార్యక్రమంలో కోదుమూరు వెంకటరెడ్డి,బుసిరెడ్డి మట్టా రెడ్డి,గజ్జల శివారెడ్డి,గజ్జల నాగార్జున రెడ్డి ఇస్రం లింగస్వామి, షేక్ అబ్దుల్ కరీం,పసుపులేటి నితిన్ మరియు సుంకిశాల తండా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

# మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

**5 నెలల జీతాలు ఇవ్వాలంటూ కార్యాలయం గేటు ముందు ఆందోళన డిమాండ్**



**బషీర్ బాగ్ వెలుతురు 16 సెప్టెంబర్:**
కోఠి లోని డైరెక్టరేట్ మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయం ముందు... మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళనకు దిగారు. గత ఐదు నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ. కార్యాలయం గేట్ ముందు బైఠాయించారు.కనీస వేతనం 25 వేలు ఇస్తూ.ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కాకుండా నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.రోడ్డుపై బైఠాయించిన ఉద్యోగులను.పోలీసులు కార్యాలయంలోకి బలవంతంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా... పోలీసులకు, ఉద్యోగుల మధ్య తోపులాట. వాగ్వివాదం జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణం విడుదల చేయాలని...ఔట్సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి. కార్పోరేషన్ ద్వారా జీతాలు ఇస్తూ.ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల సంఘంను ప్రభుత్వం గుర్తించి చర్చలకు పిలువాలని కోరారు.తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.యూనియన్ గౌరవ అధ్యక్షులు రాంబాబు యాదవ్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీయొద్దీన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ డా..శాంతి కుమార్ వైస్ ప్రెసిడెంట్ గిరిబాబు రాష్ట్ర నాయకులు ఫజల్, శంకర్, సిరాజుద్దీన్, స్వామి, నవీన్, మరియు ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు కర్ర పూజ నిర్వహించిన గోల్నాక జై భవాని యూత్ అసోసియేషన్ ప్రతినిధులు



**బషీర్ బాగ్ వెలుతురు 16 సెప్టెంబర్:**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గోల్నాక వెజిటేబుల్ మార్కెట్ జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి మంటపాన్ని ఏర్పాటు చేసేందుకు గాను మంగళవారం నిర్వాహకులు కర్ర పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మంటపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారిని నెలకొల్పి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నిర్వాహకులు కర్ర పూజ నిర్వహించి మంటపాన్ని ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పూజాది కార్యక్రమంలో ఆనంద్ కుమార్( నందు), కేజే బాబు, సురేష్, శ్రవణ్, పృధ్వి, సందీప్, జగన్, మురళి, సతీష్ ముదిరాజ్, రాహుల్ రాకేష్, అఖిల్, రాకేష్, సత్యనారాయణ, స్వామి రోహిత్, వెంకన్న వినోద్,బాలరాజ్, సురేష్, పిల్లి సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భగవంతుడు మనుషులకు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మను ఇస్తారు

**- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మెడీకవర్ హాస్పటల్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గౌరవ కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి,బండి సంజయ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ గార్లతో కలసి పాల్గొని కంటోన్మెంట్ నియోజకవర్గ పేద ప్రజలకు కూడా కార్పోరేట్ వైద్యం అతి తక్కువ ఖర్చుతో అందించాలని కోరడం జరిగింది.

## రాష్ట్రంలో నిజాం పాలన కొనసాగుతుంది

- బోయపల్లి నాగరాజు



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
గ్రూప్ 1 అభ్యర్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని హైకోర్ట్ తీర్పును అమలుచేయాలని మంగళవారం రోజున అన్ని విద్యార్థి సంఘాలతో సుందరయ్య విజ్ఞాన భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తే సమావేశం జరగకుండా అడ్డుకొని వివిధ విద్యార్థి సంఘాల నాయకుల్ని అరెస్టు చేయడం జరిగింది దీనిలో భాగంగా బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్, తుంగ బాలు ని శీను నాయక్ నాగేందర్ బోయపల్లి నాగరాజు సాయి బొల్లు నాగరాజు శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు అరెస్ట్ చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది.

# విప్లవాల గడ్డపై వీరత్వాన్ని గానం చెద్దాం

**- చరిత్ర ను వక్రీకరిస్తే చెత్త బుట్టలో కల్సి పోతారు**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**



కవి గాయక సమ్మేళనం తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యాదిలో తెలంగాణ సాహితి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(TPSK) సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సభకు తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఆనందాచారి, టీ.పీ.ఎస్.కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు వీరు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అంటే ఎందరో వీరుల నెత్తుటి త్యాగాలతో తడిసిన చరిత్ర సారికలు కట్టిన చిక్కిళ్ళపై ఎగరేసిన ఎర్రజెండా భూమి బుక్తి విముక్తి పై కురిసిన పోరాట మేఘం భావితరానికి ఇవ్వాల్టి పురటి గది రేపటి స్వప్నానికి ఇవాల్టి కన్నుమూత అని కవిత్వాన్ని కీర్తించారు తెలంగాణ సాయుధ పోరాటానికి వక్రీకరణ జరుగుతున్న ఈ తరుణంలో అసలైన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత కవులు కళాకారులపై ఉంది. తెలంగాణ నేల అంటేనే పోరాటం. ఈ గడ్డే పోరాటాల గడ్డ. ఈ నేల మీద గ్రంథాలయ ఉద్యమం ద్వారా ప్రారంభమైన ఉద్యమం ఆంధ్రమహాసభ ద్వారా భాషా సాంస్కృతిక విధానాలు కూడా రాజకీయాలతో ముడిపడి ఉందని తెలియజేసింది. పాలక వర్గాలు మనపై భాషను కూడా రుద్దే ప్రయత్నం చేస్తారు. నేడు కూడా అదే జరుగుతుంది. ఏ భాషకు మనం వ్యతిరేకం కాదు కానీ, బలవంతంగా ఏ భాషనైనా ఎవరిమీద రుద్దకూడదని అన్నారు. బంచాన్ అన్న నోటితోనే నీ ఘోరీ కడతాం కొడకా అనేలా చేసింది తెలంగాణ నేల. ఈ పోరాటం ప్రపంచాన్ని కదిలించింది.



తెలంగాణ ప్రాంత కాదులే కాదు... కలకత్తా నుంచి చిత్త ప్రసాద్ తన చిత్రాలతో , హరేంద్రనాథ్ చటోపాద్యాయ గీతాలు, ఆంధ్ర నుంచి ఆవంత్స సోమసుందర్, సుంకర , ఆరుద్ర వంటి వారు తాము కావ్యాలతో సంఘీభావం తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులమడం సరైంది కాదు. నైజాం కాలంలోనే షోయబుల్లాఖాన్, బందగీలను అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. మఖ్దూం ఇక్కడే కామ్రేడ్ అసోసియేషన్ ను ఏర్పాటుచేశారు. దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి సాహిత్యకారులు, సుద్దాల హనుమంతు వంటి వాగ్గేయకారులు ఆ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా కవులు రచయితలు ప్రతిజ్ఞ చేశారు నేను సైతం ... వీర తెలంగాణ పోరాట సంస్కృతితో ముందుకెళ్తాను నేలకొరిగిన అమరవీరుల సాక్షిగా అనుక్షణం నవతెలంగాణ నిర్మాణానికై పని చేస్తాను కవులు కళాకారులు రచయితలు జర్నలిస్టులు నేను సైతం సమసమాజ స్థాపన ఉద్యమంలో నిండిపోతాను చరిత్ర వక్రీకరణలు, కల్లబొల్లి కబుర్లు, ఉత్తి మాటలు, ఉట్టెక్కిన ఆశలు ,రాజకీయ ఎత్తులు, సాంస్కృతిక దాడులు, ఇక వద్దు.. నా తండ్రులు ఎదిరించిన నాటి శత్రువే నేటికీ ఈనాడు నీచంగా హీనంగా పీల్చి పిప్పి చేస్తుంటే... ఇంకానా ఇకపై సాగదు అని గళమెత్తారు నేను సైతం వీర తెలంగాణ పోరాట ఆశయాలకు ఊపిరి నవుతాను భావితరాలకు బాటలు అవుతాను , భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రజాతంత్ర ఐక్య ఉద్యమాలకు ఊతమవుతాను అంటూ కవులందరూ ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు వనపట్ల సుబ్బయ్య, ప్రముఖ రచయిత సామిడి జగన్ రెడ్డి,మోహన్ కృష్ణ, యం వి రమణ, సలీమా, బండి సత్తన్న,శరత్ చంద్ర అనుముల ప్రభాకర్, ఉదయగిరి మధుబాబు గెరా ముజాహిదీన్ , రెఖా, సునిత, ప్రతి ఒక్కరూ విప్లవాల గడ్డపై వీరత్వాన్ని గానం చేశారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిజ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్ళుతాం ఈ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు సంఘపరివార్ కు మతశక్తులకు మాట్లాడే హక్కు లేదని నినాదించారు ఈ కవితల్ని పుస్తకం గా తీసుక రావాలని నిర్ణయించారు మోహన్ కృష్ణ కవులకు కృతజ్ఞతలు తెలిపారు

## మేధా స్కూల్ లో మత్తు పదార్థాల తయారీ..
# మొద్దు నిద్రలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం

**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలం ఓల్డ్ బోయిన్పల్లి లోని మేధా స్కూల్ లో నే ఆల్ఫా జోలం మత్తు పదార్థం తయారు చేయడాన్నీ నిరసిస్తూ సిపిఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నా లో సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం పాల్గొని మాట్లాడుతూ స్కూల్లో మత్తు పదార్థాలు తయారు చేయడం అనేది చాలా బాధాకరమని విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలో, మత్తు పదార్థాలు తయారు చేస్తూ మత్తు పదార్థాలకు నిలయంగా మారిన ప్రవేట్ స్కూల్ యాజమాన్యాలను చూస్తుంటే ఈ సమాజం ఎటువైపు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మేధా స్కూల్ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని, స్కూల్లో చదువుతున్న విద్యార్థులు 63 మంది ని ఆ పిల్లల తల్లిదండ్రులు ఎంచుకున్న ప్రైవేటు స్కూళ్లలో ఈ సంవత్సరం నష్టం పోకుండా చదివించే పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యం దే పూర్తి బాధ్యత అని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ సంబంధించిన అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తేట తెల్లం అయిందని అన్నారు. కమర్షియల్ పనులు జరుగుతున్న బిల్డింగ్ లో స్కూలు నడిపించుకోవాలని పర్మిషన్ ఇవ్వడం దేనికి సంకేతం అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 63 మంది పిల్లల తల్లిదండ్రులు మనోవేదనకు గురి అయ్యారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలపై




రెగ్యులర్ గా తనిఖీలు చేయాలని పర్మిషన్ ఇచ్చే ముందు అన్ని విధాల సౌకర్యవంతమైన స్థలాల్లో మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం అవుతూ గంజాయి, రహిత డ్రగ్ రహిత రాష్ట్రంగా చేస్తామనడం కాదు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సీరియస్ గా గ్రేటర్ హైదరాబాద్ ని జల్లెడ పట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కల్తీలకి అడ్డాగా మారిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం జోష్యం చూస్తుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర విడి సీరియస్ గా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. శంకర్, మండల కమిటీ సభ్యులు వెంకట్ నర్సయ్య, శ్రీధర్, జగన్, వెంకట్, ధర్మారావు, రాము, ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్, నాగభూషన్ తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కేతురి నర్సింహా బదిలీ

- గణంగా వీడ్కోలు పలికిన సిబ్బంది, స్థానికులు....



**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
బాలానగర్ ఏసీపీ పరిధిలోని జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కేతురి నరసింహా గత అక్టోబర్ లో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. పదకొండు నెలల స్వల్ప కాల వ్యవది లోనే జగద్గిరిగుట్ట స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా నిర్వహించడం, స్థానిక ప్రజలతో మమేకమై నేరాల నియంత్రణలో ప్రత్యేక శ్రద్ద చూపించడం, బాధితులకు చట్టపరంగా నాయ్యం జరిగేలా, చేస్తూ ఫ్రెండ్లి పోలీస్ కు నిలువెత్తు నిదర్శనం లాగా నిలవడం ఒకవైపు అయితే, సిబ్బంది, స్థానికులు బదిలీ పై వెళ్తున్న ఇన్స్పెక్టర్ నర్సింహా ను చూసి కంఠ తడి పెట్టడం కోసమేరుపు, ఒక ఫ్రెండ్లీ పోలీస్ అధికారి బదిలీ పై వెళ్తుంటే బాధగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్ ఎస్ ఎఫ్ అధ్యక్షులుగా శశాంక్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ( ఎస్ ఎస్ ఎఫ్) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా దాసరి శశాంక్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బాన్సువాడ వేదాంత మౌర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత నాస్తిక సమాజం నియమ నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆయనను ఈ సందర్భంగా అభినందించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ ఇన్చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించాలని ఆ నియామకపు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## కాలయాపన చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్న కార్పొరేటర్ ....

**- బిజెపి నాయకులు కుమార్ యాదవ్**



**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని బిజెపి యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పి జె ఆర్ నగర్ కాలనీలోని 133 బ్లాక్ వద్ద డ్రైనేజ్ వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు బిజెపి నాయకుల దృష్టికి తీసుకోవచ్చారు. బిజెపి నాయకుడు ప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి మంగళవారం ఆయన పిజేఆర్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇండ్ల మధ్య డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై ఇండ్ల నుండి వచ్చే డ్రైనేజ్ ఇండ్ల మధ్యనే నిలిచిపోవడం వలన దుర్గంధపు వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక కార్పొరేటర్ కబ్జాలతో కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా మోసం చేస్తున్నారని అన్నారు. కేవలం ఆర్థికంగా బలంగా ఉన్న కాలనీలలో మాత్రమే ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారే తప్ప నిరుపేదలు, సామాన్య ప్రజలు, రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు జీవనం సాగిస్తున్న కాలనీలలో చిన్నచూపు చూస్తూ సమస్యలను గాలికి వదిలేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. పరిష్కారం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాధికారులను, ప్రజాప్రతినిధులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కేశవరావు, బిజెపి నాయకులు రామరాజు, నర్సింగ్ యాదవ్, సురేష్, జ్యోతి, రాజు, యువత, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీజేఆర్ నగర్, ఎల్లమ్మబండ లో పాదయాత్ర చేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...

**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీలలో డ్రైనేజీ, పారిశుద్ధ్యం కి సంబంధించిన పలు సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురావడంతో కార్పొరేటర్ మంగళవారం కాలనీలలో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీ లోని




డ్రైనేజ్ లైన్స్ కు సంబంధించి అవసరమైన బడ్జెట్ ను ప్రణాళిక వేసి ఇవ్వాలని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు. కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, చెత్తను రోడ్ల మీద లేదా బిల్డింగ్ ల మధ్యలో వేయడం వల్ల మీరు మీ పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉందని మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, తడి, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో, రోడ్లమీద, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలను కోరారు. జి.ఎచ్.ఎం.సి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. అలాగే మీ ఇంటికి వచ్చి సేవలందించే పారిశుధ్య, ఎంటమాలజి, వైద్య శాఖలకు సంబంధించిన సిబ్బందికి ప్రజలందరూ సహకరించి వారి సూచనలు పాటిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.రవి, భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, మహేష్, బషీర్, సుధాకర్, వెంకట్, చంద్రయ్య, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి..



**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
గ్రీన్ హిల్స్ రోడ్డులో గల బహుల అంతస్తుల సముదాయలైన రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్, మెరినా స్కై, రేయిన్బో విస్టా 1వ పేస్ సంఘాలు బండి. మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సంయుక్తంగా మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి గ్రీన్ హిల్స్ రోడ్డుపై ఫువర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 15 వేల మంది నివసిస్తున్న ఈ సముదాయాల నుండి ఇందులో ఉపాదికోసం రోజు వచ్చే 3వేల పైచిలుకు మహిళలు నిత్యం వేల సంఖ్య లో రోడ్డు కు అటువైపు వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని రానున్న కాలంలో కొత్తగా రాబోయే సముదాయల ద్వారా వేల సంఖ్యలో నివాసాలు రాభోతున్న తరుణంలో పాదచారులకు ప్రదాన సమస్య కు పుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయించి రంగదాముని మార్గం నుండి మాధాపూర్ కు ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా ప్రయత్నం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు సముదాయాల సంఘాల సభ్యులు టి.సత్యనారాయణరెడ్డి, ఓంకార్ రెడ్డి, రామారావు, రామ్ తిలక్, సుమంత్ కుమార్ లు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి...

**- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు...**




**కూకట్ పల్లి సెప్టెంబర్ 16 వెలుతురు:**
బతుకమ్మ, పండుగ ఉత్సవాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్లో బతుకమ్మ కుంటల మరమ్మత్తు పనులు, శుభ్రపరిచే కార్యక్రమాలను జి హెచ్ ఎం సి అధికారులు ఏఈ నిఖిల్, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక. ఈ పండుగను ప్రజలు ఆనందంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా కుంటల మరమ్మత్తు, శుభ్రత, లైటింగ్, నీటి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అన్ని పనులను జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి అని అన్నారు.

# అవకాశం ఇస్తే గ్రామానికి సేవ చేస్తా

**- గ్రామంలో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన వైద్యం అందిస్తా**

**- సామాజిక సేవా కార్యక్రమంలో గర్దాసు విక్రమ్**

**బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రపాలనగరం**



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 16:**
ఇంద్రపాలనగరం టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గర్దాసు విక్రమ్ సామాజిక సేవ కార్యక్రమంలో ముందు వరుసలో ఉన్నాడు. విద్యా రంగంలో యువకులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాబోయే తరాలకు చక్కని విద్య గ్రామీణ స్థాయిలో అందిస్తే వారు ఉన్నత స్థాయి చదువులు,చదువుకోవడానికి మొదటి మెట్టుగా ప్రాథమిక విద్య ఉంటుందని గ్రామంలో పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఉండడం గత విద్యా సంవత్సరం 100 కు 100% పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం చాలా మంచి విషయమని ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలో తన వంతుగా 150 మంది విద్యార్థులకు షూస్ అందించడం మంచి కార్యక్రమాన్ని అదేవిధంగా గ్రామంలో ఎంతో సేవలు చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది కష్టపడే విధానం చూసి వారికి తప్పకుండా మంచి బట్టలు అందించాలనే లక్ష్యంతో వారికి ఇవ్వడం చాలా మంచి విషయమని గ్రామంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ నవరాత్రులు యువకులను ప్రోత్సహించడమే లక్ష్యంగా అన్నదానం చాలా గొప్ప విషయమని యువకులను ప్రోత్సహించడానికి సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న కుటుంబాలకు అండగా నేను ఉంటా అని వివిధ సామాజిక కార్యక్రమాల్లో వారికి ఆర్థిక సహాయం చేయడం అతని మంచి మనసుకు నిదర్శనం అని సామాజిక కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని గ్రామ ప్రజలు అవకాశం ఇస్తే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యతో సమానంగా విద్య అందిస్తానని గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్యం గ్రామంలో ఏర్పాటు చేయిస్తానని గ్రామానికి సేవ చేస్తానని తెలిపినారు.

# పలువురు ఐఎఎస్‌ల బదిలీలు

**- ప్రభుత్వ సలహదారుగా ఎన్వీఎస్ రెడ్డి నియామకం**

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**
తెలంగాణలో నలుగురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహదారుగా ఎన్వీఎస్ రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారుగా ఆయన రెండేళ్ల పాటు– పదవిలో కొనసాగనున్నారు. ఎన్వీఎస్ రెడ్డిని హెచ్ఎంఆర్ఎండీ బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన ప్రభుత్వం.. మెట్రో రైలు ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా శృతి ఓజా, ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, హెచ్ఎండీఏ కార్యదర్శిగా కోట శ్రీవాత్సవకు అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా ఎం.రాజారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజేశ్వర్ నియమితులయ్యారు.











# రావి ఆకుపై మోదీ ప్రధానమంత్రి చిత్రం

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 16 :**
సంగారెడ్డి జిల్లా :- భారత ప్రధాన మంత్రి 75 వ పుట్టిన రోజు సందర్భంగా రావి ఆకులపై మోదీ చిత్రాలతో వినూత్నంగా చిత్రాలను వేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ విమోచన దినోత్సం సందర్భంగా సెప్టెంబర్ 17 ఎందరో అమరుల బలిదానం సర్దార్ వల్లభాయ్ చిత్రం మరియు నిజాం వల్లభాయ్ కి నమస్కరిస్తున్న చిత్రాలతో ... విమోచన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ... గుండు శివ కుమార్

**లీఫ్ ఆర్టిస్ట్ నారాయణఖేడ్.**

# తెలంగాణా సాయుధ పోరాట వారోత్సవాలు...!

## ముఖ్య అతిధిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దిన్...




**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దిన్ హాజరైయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు 2025 సెప్టెంబర్ 11 నుండి 17 వరకు రాష్ట్రం అంతటా జరుపుతున్నామని తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లోని రవి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ముగింపు బహిరంగా సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. నిజాం ప్రభుత్వా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మాతృ బాషా కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి మట్టి మనిషులు చేసిన తిరుగుబతి దిక్కరసరం బంఛాన్ దొర కాళ్ళు మొక్కుతా అన్న వెట్టి మనిషి దొర ఎందరో ని దొరతనం ఎందరో అంటూ బందుకులు పట్టిన కమ్యూనిస్టులు మాది హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిమ్ అయినప్పటికీ జమీందారులు జాగీర్దారులు భూస్వాములు దాదాపు తొంభై శాతం హిందువులే నిజం నవాబుకు గులాములుగా వ్యవవరించడమే గాక అనేక మందిని ఉచ కోత కోయడం మహిళలను వివస్త్రాలుగా చేసి ఊరేగింపులు చేయడం బతుకమ్మ లు ఆడించడం క్రూరమైన నేరాలు చేసి జమీందారులు దేశ్ ముఖ్ లలో వున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ యోధులను అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి గా ఉన్న నల్ల మల్ల గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో స్టింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన త్రిమూర్తులు రవి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముఖ్ధూమ్ మొయినోద్దీన్ ల విగ్రహాలు ట్యాంక్ బ్యాండ్ పై ఒకే చోట ఎరుపాటు చెయ్యాలని, దొడ్డి కొమురయ్య, షేక్ బందగి, బోమం గారి ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి వీరుల విగ్రహాలను ముఖ్య కూడలిలలో ఏర్పాటు చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో కె.రాజు సెంట్రింగ్ మెస్త్రీ యూనియన్ డివిజన్ అధ్యక్షులు, తప్పి మెస్త్రీ డివిజన్ కార్యదర్శి సుధాకర్, తముజిమ్ ఏ ఇన్సఫ్ జిల్లా అధ్యక్షులు అశ్వక్ ఉసేన్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆఫ్జల్, అజరొద్దీన్, పార్టీ నాయకులు విశ్వనాత్, పూజ, కళావతి, అమృతమ్మ, అణితమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు కృషి చేస్తున్నాం

**- హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



**నాంపల్లి వెలుతురు సెప్టెంబర్ 16, 2025:**
పౌర సదుపాయాల మెరుగుపరచడం ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . మంగళవారం లక్డికాపూల్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు రూ.17.93 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జీహెచ్ఎంసీ నిర్మించనున్న వరద నీటిని తరలించే కాలువలకు (strom water drains) నాంపల్లి లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ,మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికి నగరంలో రోడ్లు, నాళాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వరదనీటి కాలువల పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ,ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫండీ , జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

**స్టార్మ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ – వివరాలు**
వర్షాకాలంలో వరదలు మరియు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, జిహెచ్ఎంసి లక్డీకపూల్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు కీలక ప్రాంతాల్లో వర్షపు నీటి కాలువ (SWD) నిర్మాణ ప్రాజెక్టును చేపట్టింది. RCC బాక్స్ డ్రైన్ మొత్తం 2,720 మీటర్ల పొడవున నిర్మించబడుతుంది. FTCCI మార్గ్, రెడ్ హిల్స్, దేవయ్య బాగ్, ఏక్ మినార్ మసీదు రోడ్, నేతాజీ నగర్ మరియు నాంపల్లి స్టేషన్ రోడ్ వంటి ప్రాంతాల్లో వర్షపు నీటిని సమర్థవంతంగా పారుదల చేయడం లక్ష్యంగా ఉంది.

ప్రాజెక్ట్ ముఖ్యాంశాలు:
- న్యూ ప్రగతి ప్రెస్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు RCC బాక్స్ డ్రైన్ నిర్మాణం (2,150 మీటర్లు)
- చిరాగ్ అలీ లేన్ నుండి బాంబే బజార్ వరకు, నాంపల్లి స్టేషన్ రోడ్ ద్వారా RCC బాక్స్ డ్రైన్ నిర్మాణం (570 మీటర్లు) ఈ ప్రాజెక్ట్ పరిధిలోని మొత్తం క్యాచ్‌మెంట్ ఏరియా 175.13 హెక్టార్లు.

# కొండముచ్చుల భారీ నుండి ప్రజలను రక్షించండి...!

**- నిర్లక్ష్యంగా, వ్యంగంగా సమాధానాలు చెబుతున్న సంబధిత శాఖధికారులు...**

**- ప్రజలకు ఏమన్నా హాని జరిగితే అది సంబధిత శాఖధికారుల బాధ్యతే...**

**- టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్...**

**- టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు పరదేశి రాకేష్....**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
గత రెండు మూడు రోజుల నుండి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శాంతినగర్ హౌసింగ్ బోర్డ్, సంతోషిమాత మందిర్, బాగారెడ్డిపల్లి, గాంధీనగర్ తదితర ప్రాంతాలలో కొండముచ్చులు తిరిగి ప్రజలపై దాడి చేస్తున్నాయని టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు పరదేశి రాకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం సాయంత్రం ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ... కొండముచ్చుల దాడులలో ఆయా కాలోనివాసులు ప్రాణాలు పోయే పరిస్థితిలో ఉన్న ఫారెస్టుకు సంబంధించిన అధికారులకు సమాచారం ఇచ్చిన వాళ్లు మేము వీటిని ఏమీ చేయలేము మా పరిధిలోకి లేవు అని చెప్పి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరుగుతుందని తెలిపారు. మరి ఈ కొండముచ్చులను కొండముచ్చుల దాడుల నుంచి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కొండముచ్చులను ఎవరు నివారిస్తారో అధికారులు సమాధానం చెప్పాలని వారన్నారు. ఏ అధికారులకు చెప్పినా... ప్రజలు తమ వెంట తప్పకాయలు, కట్టెలు పట్టుకొని తమకు తాము రక్షించుకోవాలని నిర్లక్ష్యంగా, వ్యంగంగా సమాధానాలు చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏమన్నా హాని జరిగితే అది వాళ్ళ బాధ్యతేనని టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు పరదేశి రాకేష్ హెచ్చరించారు.



# మలూరు ఎమ్మెల్యే నంజేగౌడకు చుక్కెదురు

**- ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు**

**బెంగళూరు,సెప్టెంబర్16( వెలుతురు):**
కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజేగౌడకు హైకోర్టులో చుక్కెదురైంది. మలూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నిక చెల్లదని కర్ణాటక హైకోర్టు మంగళవారంనాడు సంచలన తీర్పునిచ్చింది. తిరిగి ఓట్లు లెక్కించి నాలుగు వారాల్లోగా ఫలితం ప్రకటించాలని భారత ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నంజేగౌడ గెలుపును బీజేపీ అభ్యర్థి కేఎస్ మంజునాథ్ గౌడ హైకోర్టులో సవాలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఫలితాన్ని రద్దు చేయాలని ఆయన కోర్టును కోరారు. జస్టిస్ ఆర్.దేవాదాస్ దీనిపై విచారణ జరిపి తాజా తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా వీడియో ఫుటేజ్‌ను జాగ్రత్త చేశారా లేదా అనే విషయాన్ని ధ్రువీకరించాలని కోలార్ జిల్లా మాజీ ఎన్నికల అధికారి వెంకటరాజును కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను కోర్టుకు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొంది.

# నాలుగు రోజులుగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్న భవాని ముదిరాజ్

**- దీక్షకు ముదిరాజ్ నేతల మద్దతు..**

**- శ్రీ చండీ ముదిరాజ్ మత్స్యకార సంఘం కోట్ల పుష్పలత ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు**



**నల్లగొండ జిల్లా వెలుతురు సెప్టెంబర్ 16:**
అను మూల మండల్ నల్లగొండ జిల్లా లో ముదిరాజ్ బిడ్డ భవాని శివాలయం గుడి విషయంలో నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కు ముదిరాజ్ నేతలు మద్దతు పలికారు. దీక్షకు సంబంధించిన విషయాలు తెలుసుకొని భవానికి శ్రీ చండీ ముదిరాజ్ మచ్ఛ కార సంఘం తరఫున పూర్తి మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయం జరిపిస్తామని వారి బంధువుల అంగీకారంతో నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేయడం జరిగింది. విషయం ఏదైనా ముదిరాజ్ జాతి పేరుతో పెట్టుకున్న సంఘాలన్నీ కూడా ముదిరాజులకు ఏదైనా అన్యాయం జరిగితే తమ వంతు బాధ్యతగా మద్దతు తెలిపాలని మనమంతా ఏకతాటిపై ఉన్నామని ప్రజల్లోకి సమాచారం వెళ్లాలివిషయం ఏదైనా న్యాయపోరాటం చేయవచ్చన్నారు. ముందుగా ముదిరాజులంతా ఐక్యతతో ఉండాలని సంఘాలకు న్యాయం చేయాలని ప్రతి ఒక్కరు ఆలోచించాలి శ్రీ చండి ముదిరాజ్ మచ్ఛ కార సంఘం కోట్ల పుష్పలత ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**- భారీగా ఆస్తులను గుర్తించిన అధికారులు**



**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**
విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. మణికొండలోని నివాసంతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధుల ఇండ్లలోనూ సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాలు కొనసాగాయి. ఏడీఈ బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లలో అధికారులు మొత్తం 15 బృందాలుగా విడిపోయి గచ్చిబౌలి , మాదాపూర్ , హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో పలుచోట్ల సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో తనిఖీల్లో భాగంగా భారీ ఆస్తులు బయటపడుతున్నాయి. గచ్చిబౌలిలో ఖరీదైన భవనం గుర్తించినట్లుగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వెల్లడించారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో 10 ఎకరాల వ్యవసాయ భూమిని అంబేద్కర్ కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అక్కడే మరో వెయ్యి గజాల్లో వ్యవసాయ క్షేత్రం కూడా ఉన్నట్లుగా గుర్తించామని అన్నారు. విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఆస్తులపై సోదాలు ముగిశాక మరిన్ని వివరాలు వెల్లడిస్తాం ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు.

## మైదం మహేశ్ కుటుబానికి కెటిఆర్ అండ



**ములుగు,సెప్టెంబర్16( వెలుతురు):**
ములుగు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మైదం మహేష్ ఐదు నెలలుగా వేతనం అందలేదని మనస్థాపంతో ఈ నెల మూడవ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు .కేటీఆర్ సమకూర్చిన ఐదు లక్షల రూపాయల విలువైన బాండ్లను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మహేష్ భార్య, పిల్లలకు మాధవరావు పల్లెలోని వారి స్వగృహంలో అందజేశారు.

## ఆగని యూరియా ఎదురుచూపులు

**వరంగల్ సెప్టెంబర్16( వెలుతురు):**
యూరియో రామచంద్రా అన్న అన్నదాతల ఆర్తనాదాలు వరంగల్ జిల్లా పర్వతగిరిలో మారుమోగుతున్నాయి. ఒక్క బస్తా యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు చూస్తే కంటనీరు పెట్టని వారుండరు అంటే అతిశయోక్తి కాదనడానికి పర్వతగిరిలోని రైతు వేదిక..పీఏసీఎస్ సొసైటీ వద్ద కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలే అందుకు సజీవ సాక్ష్యాలు. పంటను కాపాడుకోవాలంటే తిండీ..నిద్రా జాన్తానై ..యూరియా కావాల్సిందే.. అంటూ రైతులు జాగారాలుంటున్న దుస్థితి వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పుడు విరివిగా కనిపిస్తోంది. ఇంత చేసినా యూరియా దొరకకపోవడంతో కొందరు నిరాశగా వెనుదిరిగితే..మరికొందరు రేవంత్ సర్కారుకు శాపనార్థాలు పెడుతున్నారు. తమ గోడును వినే వారే లేకపోవడంతో యువ రైతులు రైతు వేదికల వద్ద తాళం వేసిన షట్టర్లను బాధతో బాధడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత పరిస్థితి. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు కానీ..స్థానిక ప్రజాప్రతినిధులు కానీ అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఎమ్మెల్సీ జయమంగళ రాజీనామా కేసు

**- మండలి ఛైర్మన్‌కు హైకోర్టు షాక్**

**- ఖర్చుల కింద పదివేలు జమ చేయాలని ఆదేశాం**

**అమరావతి,సెప్టెంబర్16( వెలుతురు):**



ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ రాజీనామా ఆమోదించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి మంగళవారం ఏపీ హైకోర్టు షాక్ ఇచ్చింది. పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలంటే అందుకు ఖర్చుల కింద రూ.10వేలు చెల్లించాలంటూ సదరు న్యాయవాదిని ఈ కేసు విచారిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు లీగల్ సర్వీస్ అథారిటీకి ఈ నగదు చెల్లింపులు జరగాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి స్పష్టం చేశారు. జయమంగళవెంకట రమణ..తొలుత టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ కొద్ది నెలలకు ఆయనకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి.. శాసన మండలికి పంపారు. అనంతరం తనకు విలువ ఇవ్వడం లేదంటూ 2024, నవంబర్‌లో తన ఎమ్మెల్సీ పదవితోపాటు- వైసీపీకి ఆయన రాజీనామా చేశారు. ఆ లేఖను శాసన మండలి ఛైర్మన్ కె. మోషేజ్ రాజుకు స్వయంగా అందజేశారు. కానీ ఆ లేఖను ఛైర్మన్ ఆమోదించ లేదు. ఈ నేపథ్యంలో తన రాజీమానా లేఖను ఆమోదించేలా శాసన మండలి ఛైర్మన్‌ను ఆదేశించాలంటూ జయమంగళ వెంకట రమణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తమకు కొంత సమయం ఇవ్వాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరఫు న్యాయవాది కోర్టుకు కోరారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని.. మరింత సమయం అంటే ఎలా అంటూ జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. మరింత సమయం అంటే.. ఖర్చుల కింద రూ. 10 వేలు చెల్లించాలంటూ సదరు న్యాయమూర్తిని ఆదేశించారు. ఈ కేసు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## కళ్లు తిరిగి పడిపోయిన మధుయాష్కీ

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**
కాంగ్రె÷-స్ నేత, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ అస్వస్థతకు గురయ్యారు. సెక్రటేరియట్‌లో మంత్రి శ్రీధర్ బాబును కలవడానికి వెళ్లిన ఆయన ఉన్నట్టుండి ఛాంబర్‌లో కళ్ళు తిరిగి పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన మంత్రి శ్రీధర్ బాబు సిబ్బందిని అలర్ట్ చేశారు. హుటాహుటినా మధు యాష్కీనీ చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# అటవీ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టులు పెడతాం

**- ఫారెస్టు సిబ్బందికి ఒక అక్కగా నేను అండగా ఉంటా**

**- అటవీ శాఖ అసోసియేషన్ సమావేశంలో మంత్రి సురేఖ స్పష్టీకరణ**

**- హర్షం వ్యక్తం చేసిన ఫారెస్టు అసోసియేషన్ అధికారులు**

**- ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
అటవీ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టులు పెడతామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర అటవీ శాఖ అధికారుల అసోసియేషన్ సంఘాలతో మంత్రి సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారుల సంఘాల నాయకుల తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... తాను ఫారెస్టు సిబ్బందికి ఒక అక్కగా అండగా ఉంటానని చెప్పారు. ఫారెస్టు ఉద్యోగుల సమస్యలు వినేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చిన్న చిన్న విషయాలు శాఖపరంగా మనమే పరిష్కరించుకుందామని గుర్తు చేశారు. కీలక అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామని చెప్పారు. మనమంతా ఒక ఫ్యామిలీ అని మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. ఎందుకంటే, అటవీ శాఖకు, ఫారెస్టు ఉద్యోగులే ఫ్రంట్ రన్నర్స్ అని తెలిపారు. అలాంటి ఉద్యోగుల కోసం పని చేయడం తన బాధ్యత అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పోలీసులకు ఎటువంటి జీత భత్యాలు ఇస్తున్నారో... అటవీ అధికారులకు అంతే స్థాయిలో ఇచ్చేందుకు తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని చెప్పారు. అయితే, మంత్రి సురేఖ స్పందనకు సమావేశంలో పాల్గొన్న అటవీ అధికారుల అసోసియేషన్ నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అటవీ అధికారులకు అవార్డులు ఇచ్చేవారని... రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ అవార్డులు ఇవ్వడం ఆపేశారని మంత్రి సురేఖ గుర్తు చేశారు. అయితే, ఇటీవల జరిగిన అటవీ శాఖ రివ్యూలో సీఎం దృష్టికి తీసుకెళితే ఆయన సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని మంత్రి సురేఖ సమావేశంలో ప్రస్తావించారు. తెలంగాణ వచ్చిన తరువాత ఈ తరహాలో మంత్రి సపోర్టు చేయడం తొలిసారి అని ఫారెస్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

సమావేశంలో ఫారెస్టు అసోసియేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన అంశాలు
మహారాష్ట్ర మాదిరి అటవీ భూములను అన్యాక్రాంతం చేసేవాళ్ళను కఠిన చట్టాలతో శిక్షించాలి.
అటవీ శాఖ బీట్ అధికారుల నియామకం వెంటనే చేపట్టాలి.
దాదాపు 2 వేల పోస్టులు వీలైనంత త్వరగా భర్తీ చేయాలి.
ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ లను జోన్ పోస్టును డిస్ట్రిక్ లెవల్ పోస్టుగా చేయాలని అన్నారు.
క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు బీట్, సెక్షన్, డీఆర్ఓలకు ద్విచక్రవాహనాలు ఇవ్వాలి.
స్టేట్ లెవల్‌లో సెక్షన్లను, బీట్లను పునర్ వ్యవస్థీకరణ చేయాలి.
ఫారెస్టు ఏరియాలో పని చేసే అధికారులను మూడు సంవత్సరాలకు ఒకసారైన కౌన్సిలింగ్ ద్వారా 100 శాతం బదిలీలు జరపాలి.
ప్రతి జిల్లాకు రెండు, మూడు ఫారెస్టు స్టేషన్ లు ఏర్పాటు చేయాలి. సిబ్బందికి అటవీ పరిరక్షణలో భాగంగా ఆయుధాలు ఇవ్వాలి.
గ్రామీణ ప్రాంతాల్లో అడవుల్లో ఉన్న ఫారెస్టు అధికారులకు హెచ్ఆర్ఏ తీసివేసి రెంట్ ఫ్రీ క్వాటర్స్ ఇవ్వాలి.
ఎక్సైజ్ శాఖలో రద్దు చేసిన మాదిరిగా కన్వర్షన్ కోటాను ఫారెస్టు డిపార్టుమెంటులో కూడా రద్దు చేసి రెగ్యులర్ ప్రమోషన్ ద్వారానే వాటిని భర్తీ చేయాలి.
యంగ్ ఇండియా స్కూల్ లో పోలీసు సిబ్బంది పిల్లలకు అడ్మిషన్స్ ఇవ్వాలని సంకల్పించినట్టు... ఫారెస్టు అధికారులకు పిల్లలకు ఇవ్వాలి.
డిప్యూటీ రెంజర్స్ కు గెజిటెడ్ స్టేటస్ ఇవ్వాలి.
దీర్ఘకాలికంగా విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్, డిసిప్లినరీ కేసులను తొందరగా పరిస్కరించి న్యాయం చేయాలి.
పోలీసులకు ఎటువంటి జీతభత్యాలున్నాయో ఫారెస్టు అధికారులకు ఇవ్వాలన్నారు.
ఈ సమావేశంలో అటవీ అధికారులకు సంబంధించిన మూడు సంఘాలు పాల్గొన్నాయి. ఏసీఎఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ అసోసియేషన్ నరేందర్, షౌకత్ అలీ, విజయ్ కుమార్, సవిత, రవి కిరణ్, తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. నాగేందర్, ఉపాధ్యక్షులు బి. సాంబు, రాష్ట్ర కార్యదర్శి బి. ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ పి. సుకన్య, ట్రెజరర్,కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.


# నాకు ప్రాణం పోసింది ఈ డాక్టరే

**- కార్పొరేట్ ఆసుపత్రులు పేదలను ఆదుకోవాలి**

**- సికింద్రాబాద్ 'మెడికోవర్' ఆసుపత్రి ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు**




**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 16:**
తాను ఈరోజు బతికి ఉన్నానంటే దానికి కారణం మెడికోవర్ ఆసుపత్రి డాక్టర్ శరత్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గతంలో తనకు కరీంనగర్ లో హార్ట్ ఎటాక్ వచ్చి స్పృహ తప్పి పడిపోతే స్థానిక ఆసుపత్రికి తీసుకుపోతే బతకడం కష్టమని, ఇంటికి తీసుకెళ్లాలని తమ కుటుంబానికి చెప్పారని, ఆ సమయంలో హైదరాబాద్ లో ఉన్న డాక్టర్ శరత్, డాక్టర్ సాహు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక డాక్టర్లతో 4 గంటలపాటు మాట్లాడి తనను బతికించారని చెప్పారు. ఈరోజు సికింద్రాబాద్ లోని 'మెడికోవర్ ' ఆసుపత్రి ప్రారంభోత్సవానికి బండి సంజయ్ తోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే గణేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే.... మెడికోవర్ (MEDICOVER) నెట్ వర్క్ ఇండియాతోపాటు జర్మనీ, పోలెండ్, బల్గేరియా, ఉక్రెయిన్ వంటి 12 దేశాలకు విస్తరించింది. 23 వరల్డ్ క్లాస్ హాస్పిటల్స్ ను ఏర్పాటు చేశారు. 18 మల్టీ స్పెషాలిటీ, 2 ఉమెన్ అండ్ చైల్డ్ 3 క్యాన్సర్, 2 ఓపీడీ ఆసుపత్రులను నెలకొల్పారు. డాక్టర్ అనిల్ క్రిష్ణ (మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్) ఆధ్వర్యంలో అత్యాధునిక టెక్నాలజీ, సీనియర్ మోస్ట్ డాక్టర్లతో అద్భుతమైన సేవలందిస్తున్నారు. హెల్త్ కేర్ రంగంలో రికార్డు సృష్టిస్తోంది. ఇండియాలో 16 నగరాల్లో 23 ఆసుపత్రులను ఏర్పాటు చేసి 1200 మంది డాక్టర్లతో ఇప్పటి వరకు కోటి మందికిపైగా సేవలందించడం గొప్ప విషయం. 13 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ముందుకు పోతున్నారు. తెలంగాణ విషయానికొస్తే... 6 చోట్ల (హైటెక్ సిటీ, చందానగర్, సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్), ఏపీలో నెల్లూరు, కర్నూలు, శ్రీకాకుళం, వైజాగ్, కాకినాడ, విజయనగరం జిల్లాల్లో విస్తరించి తెలుగు ప్రజలకు విస్తృతమైన వైద్య సేవలను అందించడం చాలా సంతోషంగా ఉంది. యూరప్ లో పాపులర్ ఆసుపత్రి ఏదంటే మెడికోవర్ అని చెబుతారు. నా దృష్టిలో కూడా బెస్ట్ హాస్పిటల్ ఏదంటే మెడికోవర్ అని చెబుతా. దానికీ కారణముంది. ఈ ఆసుపత్రి డాక్టర్ శరత్ రెడ్డి నాకు ప్రాణం పోశారు. ఈరోజు మీ ముందు నేను మాట్లాడుతున్నానంటే దానికి కారణం డాక్టర్ శరత్, డాక్టర్ సాహు గార్లే కారణం. 2012లో కరీంనగర్ లో ర్యాలీ తీస్తుంటే హార్ట్ స్ట్రోక్ వచ్చింది. ఆసుపత్రికి తీసుకొస్తే మీ అబ్బాయి బతకడం కష్టం, ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు మా అమ్మకు చెప్పారు. అప్పుడు మా సిస్టర్ డాక్టర్ సౌమ్య డాక్టర్ శరత్ కు ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాహుతో మాట్లాడారు. 3, 4 గంటలపాటు కష్టపడి నన్ను బతికించారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది నాకు పునర్జన్మ. దీనికి కారణం డాక్టర్ శరత్, డాక్టర్ సాహుయే. మెడికోవర్ ఆసుపత్రి వైద్యుల సేవల భేష్. ఇయాళ సికింద్రాబాద్ లో ఇంత పెద్ద హాస్పిటల్ ను నిర్మించడం, ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉంది. వైద్యో నారాయణ హరి అంటాం. ప్రాణం పోసే డాక్టరే మనకు ప్రత్యక్ష దైవంగా భావిస్తాం. దురదృష్టమేందంటే కొందరు డాక్టర్లు, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తూ ట్రీట్ మెంట్ కు వచ్చే రోగులను పీడిస్తున్నై. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నరు. ఎందుకంటే ఆసుపత్రి బిల్లులు భరించలేనంతగా ఉన్నాయి. తొలుత ఆసుపత్రిలో చేరినప్పుడు ట్రీట్ మెంట్ కు ఎంత ఖర్చుయితదని చెబుతారో... డిశ్చార్జ్ అయ్యే నాటికి అంతకు ఐదారు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఆసుపత్రులంటే భయపడే పరిస్థితి ఉన్న ఈరోజుల్లో భయం వద్దు... ఆసుపత్రి అంటే భరోసా కల్పించాల్సిన అవసరం మనందరిపైనా ఉంది. మెడికోవర్ ఆసుపత్రి యాజమాన్యం 'మెడికోవర్డ్ ఫ్యామిలీ కార్డు'ను ప్రవేశపెట్టడం గొప్ప విషయం. ఈ కార్డు తీసుకున్న కుటుంబ సభ్యులందరికీ 15 నుండి 50 శాతం వరకు ఆసుపత్రి బిల్లులో డిస్కౌంట్ ఇస్తుండటం శుభపరిణామం. ఆసుపత్రికి భారమైనప్పటికీ రోగులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్న మెడికోవర్ ఆసుపత్రి యాజమాన్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. పేదలకు వైద్య సేవలందించే విషయంలో కార్పొరేట్ ఆసుపత్రులు మరింత ఉదారంగా వ్యవహరించాలని, ఈ విషయంలో మెడికోవర్ ఆసుపత్రి యాజమాన్యం ముందుండాలని కోరుకుంటున్నా....



# నల్లగొండ ఫోక్సో కోర్టు సంచలన తీర్పు

**- బాలికపై అత్యాచారం కేసులో కామంధుడికి 24 ఏళ్ల జైలు**



**నల్లగొండ,సెప్టెంబర్16( వెలుతురు):**
మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పోక్సో, నిర్భయ, దిశ లాంటి ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా వారిపై అఘాయిత్యాలు మాత్ర ఆగడం లేదు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా కొందరు కామాంధులు రాక్షసత్వంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులకు ఒడిగడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆడవారు ఒంటరిగా కనిపిస్తే చాలు అత్యాచారాలకు పాల్పడుతన్నారు. విచక్షణ మరచి దారుణాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్గొండ పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. 2023 సంవత్సరం మార్చి నెలలో అన్నెపర్తి గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య అనే 60 ఏళ్ల వ్యక్తి, 4వ తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నల్లగొండ పోక్సో కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. అయితే తాజాగా విచారణ ముగియడంతో.. కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఊషయ్యకు 24 ఏళ్ల కారాగార శిక్ష, రూ. 40 వేల జరిమానా విధిస్తూ.. కోర్టు తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పుతో బాధిత కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. పోక్సో కోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

# ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్

**- మెరుపు వరదలతో ఇళ్లు,రోడ్లు ధ్వంసం**



**డెహ్రాడూన్, సెప్టెంబర్16( వెలుతురు):**
ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. డెహ్రాదూన్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. సహస్త్రధారలో వరద ధాటికి పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద,ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు,దుకాణాలు, హోటళ్లు దెబ్బతిన్నాయి. రహదారుల పైకి భారీగా వరద చేరడంతో వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. డెహ్రూడూన్‌లో సహస్త్రధార ప్రాంతంలో వరదలు సంభవించి రోడ్లు కొట్టుకుపోయాయని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం మంగళవారం వెల్లడించింది. ఈ వరదల్లో చిక్కుకుపోయిన వారికి ఎస్‌డిఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఇక ఉత్తరాఖండ్ జిల్లాలో వరదలు రావడంతో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారని సమాచారం. దేవభూమి ఇనిస్టిట్యూట్ విద్యార్థులతో సహా వంద మందికిపైగా ప్రజలను రెస్క్యూ దళం కాపాడింది. వర్షాల వల్ల సహస్త్రధార, మాల్ దేవతా, ముస్సోరీ ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు- విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి 300 - 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.కాగా, ఈ వరదల వల్ల సహస్త్రధార, డెహ్రాడూన్‌లో కొత్త దకాణలు దెబ్బతిన్నాయి. ఈ వార్తవిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం డెహ్రాడూన్‌లో, సహస్త్రధార ప్రాంతాల్లో పర్యటించారు.

## నేడు విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటన

**- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు**



**విశాఖపట్టణం, సెప్టెంబర్16( వెలుతురు):**
ఒకరోజు పర్యటన నిమిత్తం ఈ నెల 17న బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు రానున్నారు. ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి నుండి ప్రత్యేక హెలికాప్టర్ లో బయలుదేరి 11-15 గంటలకు బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్ కు చేరుకుంటారు. అక్కడినుండి ఉదయం 11-25 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో గల ఏ యు సాగరిక ఫంక్షన్ హాల్ చేరుకుని, ఉమన్ అండ్ చైల్డ్ హెల్త్ స్క్రినింగ్ క్యాంప్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం 12 గంటల నుండి ఏ యూ కన్వెన్షన్ సెంటర్ లో ప్రధానమంత్రి వర్చువల్ గా ప్రారంభించే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సాయంత్రం 3 గంటలకు హోటల్ రాడిసన్ బ్లూ లో జరిగే గ్లోబల్ క్యాపబిలిటీ- సెంటర్ బిజినెస్ సమ్మేట్ లో పాల్గంటారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి 5 గంటల 20 నిముషాలకు కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్ కు చేరుకుని గుంటూరు జిల్లా, తాడేపల్లి బయలుదేరి వెళతారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ, జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు కలిసి మంగళవారం పర్యటించి బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించి అధికారులకు సూచనలు చేశారు.

## భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

**న్యూడిల్లీ,సెప్టెంబర్16( వెలుతురు):**
భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్‌కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడానికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ %ూూ%-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. %ూూ%-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్‌ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు.ఎన్‌కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్‌ను దిగుమతి చేసుకుంది. ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దాడిని ప్రారంభించే ముందు, పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. %ూూ%-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్‌లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి.ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రాన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్సిన్తేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా డోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు. ముడిచమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ డ్రోన్ కమాండ్ పేర్కొంది. విజయవంతమైన దాడిని నిర్వహించామని స్పష్టం చేసింది.

# ఆదానీ సిమెంట్‌కు భూ కేటాయింపులు రద్దు చేయాలి

### సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్

**విశాఖపట్టణం , సెప్టెంబర్16( వెలుతురు):**
పెదగంట్యాడలో అదానీ గంగవరం గ్రైడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూ కేటాయింపులు, అనుమతులు రద్దు చేయాలని, జనావాసాలకు దూరంగా పరిశ్రమలు ఏర్పాటు- చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేసారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, వి.క్రిష్ణారావులతో కలిసి సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ... విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం సర్వే నెంబరు 97పి, 98,99పి, 101పి లో సుమారు 20ఎకరాల భూమిని ఆదానీ మెస్సర్స్ అంబూజా సిమెంట్స్ లిమి-టె-డ్‌కు గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ ఏర్పాటు-కు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇందుకు అక్టోబరు 8న ప్రజాభిప్రాయసేకరణ చేపడుతున్నట్లు- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసింది. సాగరతీరం, స్టీల్‌ఎ÷-లాంట్, జనవాసాలకు మధ్య ఈ పరిశ్రమ ఏర్పాటు- వలన పెదగంట్యాడ, గాజువాక, గంగవరం ,మల్కాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటు-న్న సుమారు 12 లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు, జీవరాసులకు హాని జరుగుతుంది. ఈ పరిశ్రమ వలన గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయి. శబ్ధ కాలుష్యం పెరుగుతుంది. భారీ వాహన రాకపోకలు పెరిగి ప్రమాదాలు పెరుగుతాయి. ప్రాణనష్టం అధికమవుతుంది. ఈ ప్రాంతం గుండా ప్రతిరోజు కొన్ని వేలమంది ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరికి రక్షణ వుండదు. ఈ పరిశ్రమకు కేటాయించదలచిన భూముల్లో వఅక్షాలు, కొన్ని రకాల వణ్యప్రాణులు కనుమరుగ వుతాయి. అదానీ ప్రయోజనాల కోసం 12 లక్షల మంది ప్రజలు, జీవరాసుల ప్రాణాలను ఫణంగా పెట్టడం అన్యాయం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లు వెంటనే జోక్యం చేసుకోవాలి. ఈ భూ కేటాయింపులు, అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ గంగవరం సిమెంటు- గ్రైడింగ్ పరిశ్రమ ఏర్పాటు-వలన అదనపు కాలుష్యం తప్ప ఈ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమి లేదు. కేవలం 60 పర్మినెంటు-, 200మందికి కాంట్రాక్టు ఉపాధి




మాత్రమే లభిస్తుంది.అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీ-లేదు. అదానీ గంగవరం పోర్టు కాలుష్యం వలన ఇప్పటికే గంగవరం, గాజువాక, మల్కాపురం ప్రాంతాల ప్రజలు తీవ్ర రోగాల బారినపడుతున్నారు. ఇళ్లలోపలకు రసాయనాలు, దుమ్ము, పౌదరు వచ్చి చేరుతున్నాయి. మహిళలకు గర్భస్రావాలవుతున్నాయి. వయస్సులతో నిమిత్తం లేకుండా అన్ని తరగతుల ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. దీనికి తోడు ఆదానీ సిమెంటు- పరిశ్రమ వస్తే ఈప్రాంత ప్రజల జీవితాలు మరింత దుర్భరమవుతాయి. అదానీకి తమ లాభాలు తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టవని ఆచరణలో తేలిపోయింది. గంగవరం పోర్టు కాలుష్యంతో అపార్ట్‌మెంట్లు-, కాలనీల ప్రజలు, విద్యా సంస్థలు, వైద్య సంస్థలు నరకం చూస్తున్నారు. కాబట్టి 12 లక్షల మంది ప్రజలకు హానిచేసే అదానీ గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్‌కు ఎటు-వంటి అనుమతులు ఇవ్వరాదని, భూ కేటాయింపులు, ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. లేనిపక్షంలో ప్రజాందోళన తప్పదని హెచ్చరించారు. గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడ, మల్కాపురం, గంగవరం ప్రజలు ఆందోళనకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శుద్ధి కార్యక్రమం

**తిరుమల, సెప్టెంబర్16( వెలుతురు):**
బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 02వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్ని పూర్తి చేసినట్లు- తెలిపారు. బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆగమానుసారంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు-, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు-



పూజాసామగ్రిని శుద్ధి చేసినట్లు- తెలిపారు. కాగా, ఆలయంలో ఉదయం 6 నుండి ఉదయం 10 గంటల వరకు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టు-ను వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టు-కు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారని తెలిపారు. పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టు-కు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడు, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ముఖ్య నిఘా భద్రతాధికారి మురళీకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

జిల్లా కలెక్టర్ హరి చందన దాసరితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుబ్రహ్మ ,గురువిష్ణు ,గురుదేవో మహేశ్వరని జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చిందని, ప్రతి




విద్యార్థికి గుణాత్మకమైన విద్య బోధన అందించే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం ఆరోజు రాష్ట్రస్థాయి కార్యక్రమాలు ఉన్నందున హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఈరోజు జరుపుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో 108 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం నిరంతర శ్రమకి, అంకిత భావానికి దక్కిన గుర్తింపు మాత్రమేనని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలోని పాఠాలు చెప్పే యంత్రాలు కాదు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని అన్నారు. విద్యార్థులలో జ్ఞానాన్ని నైతిక విలువలను క్రమశిక్షణ నింపి వారిని ఉత్తమ పౌరులుగా మార్చే మహోన్నతమైన బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని అన్నారు. విద్యార్థులే దేశ సంపద అని తరగతి గదిలో దేశ భవిష్యత్తు ఉన్నందున మీరు నాటే జ్ఞానబీజాలే రేపటి సమాజానికి ఫలాలను ఇచ్చే మహ వృక్షాలుగా విద్యార్థులు ఎదుగుతారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ ఫార్మా రంగాలకే కాదని విద్య రంగానికి కూడా రాజధాని గా విలసిల్లుతుందని అన్నారు. జిల్లా అక్షర శాతం 83 కి పైగా ఉండడం మనందరికీ గర్వకరణమని అన్నారు. జిల్లాలో 2300 పైగా పాఠశాలలు ఉన్నాయి 690 ప్రభుత్వ పాఠశాలలో సుమారు లక్ష మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారాని అలాగే 5 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యా బోధన అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం డ్రాప్టన్ పూర్తిగా నివారించడం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం మన ముందున్న లక్ష్యమని ఈ లక్ష్య సాధనలో మీ అందరి భాగస్వామ్యం అత్యంత కీలకమని గుర్తు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కంకణం కట్టుకున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల ప్రోగ్రాం కింద పాఠశాల మరమ్మత్తులు చేయడం, డిజిటల్ తరగతి గదులు, ఏఐ పాఠాలు, యంగ్ ఇండియా ప్రభుత్వ పాఠశాలలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. తల్లిదండ్రులతో సమానంగా గౌరవించబడే వృత్తి లో ఉన్న ఉపాధ్యాయులు రాబోయే సమాజాన్ని తయారు చేసే బాధ్యతను ముందుకు తీసుకెళుతున్న మీ అందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. మరింత గురుతర బాధ్యత అనే అంశాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ గారి జయంతి సందర్భంగా మనం జ్ఞాపకం చేసుకోవడమే ఉపాధ్యాయ దినోత్సవమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో పేదలకు ఇవ్వడానికి భూములు ఆర్థికంగా సహకరించడానికి భూములు ఉండే ఇప్పుడు సమాజానికి ఇవ్వడానికి అభివృద్ధికి ఉపయోగపడేది ఒకేఒకటి విద్య మాత్రమే అని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు చెప్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన నామోషి కాదని విద్యార్థులందరినీ విశ్వాసం కల్పిస్తూ పుణాత్మకమైన విద్య అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడానికి మీరే వారదులని మంత్రి స్పష్టం చేశారు. అత్యున్నత ప్రతిభ కలిగి,ఉన్నత చదువులు చదివి ,ఎన్నో పరీక్షలు రాసి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారని ఇండస్ట్రీ ,ఐటి, మెడికల్ రంగంలోనైనా ప్రైవేట్ ఆధిపత్యం నడిచిన విద్య వ్యవస్థలో పూర్తిస్థాయిలో క్వాలిఫైడ్ ఉన్నప్పటికీ మిమ్మల్ని డామినేట్ చేసే విధంగా ప్రైవేట్ వ్యవస్థ వస్తుందని ఉపాధ్యాయులందరూ పునరాలోచన చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఫ్రీ విద్యుత్, ఫ్రీ వాటర్ ,బుక్స్,ఉపాధ్యాయ నియామకాలు ,ప్రమోషన్ల అన్ని రకాల మౌలిక వసతుల కల్పన కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంటే నామూషి కాదు ఇటీవల కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఉండటం గర్వకారణమని అన్నారు.

ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణ గారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో మీరు అవార్డులు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేను ముఖ్యమంత్రి గారు ,సిఎస్ , డిజిపి ,ఇతర ఉన్నతాధికారులు అందరు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వచ్చిన వాళ్ళమేనని అన్నారు పిల్లల మంచి విద్య అందిస్తే వారు దేశ సంపద సృష్టించడమంటే యువతకు మంచి మార్గదర్శకం అవుతుందని అన్నారు. విద్యా బోధన మొత్తం డిజిటలైజేషన్ అవుతుందని పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన మారాలని సూచించారు. దేశానికి రాష్ట్రానికి విద్యార్థులు మార్గదర్శకులుగా మారాలి.. పాఠశాలలో సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాన్ని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ మొదటి గురువు తల్లిదండ్రులు, తరువాత ఉపాధ్యాయులేనని విద్యారంగంలో ప్రభుత్వం సమూల మార్పులు తేవటం జరిగిందని , మౌలిక వస్తువులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఏఐ పై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించడం జరిగిందని హైదరాబాద్ జిల్లాను ఉత్తీర్ణత శాతంలో ముందు ఉంచాలని తెలుపుతూ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎంపికైన 108 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ప్రశంస పత్రాలు, మెమెంటోస్ ఈ సందర్భంగా అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు, ఉత్తమ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేకాటలో దొరికిన వ్యక్తి మృతి

### బంధువుల అందోళన

**అనంతపురం సెప్టెంబర్16( వెలుతురు):**
పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డ నాగలగుడ్డం తండాకు చెందిన రామకృష్ణ మృతి చెందాడు. సింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహంతో సింగనమల పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. సోమవారం నాడు పేకాట స్థావరాలపై దాడిలో రామకృష్ణ దొరికిపోయాడు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్కు పిలిపించి కొట్టారంటూ బంధువుల ఆరోపణ. మృతదేహాన్ని స్ట్రెచర్పై పెట్టుకుని పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు కుటుంబ సభ్యులు. "పోలీసుల కొట్టడం వల్లే మృతి" అంటూ బంధువుల ఆరోపణలు. మృతుని స్వగ్రామం సింగనమల మండలం నాగలగుడ్డం తండా.

# ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ

## జత కుదరిందంటూ మూవీ టాక్



జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండగా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్విన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే.. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు- సమాచారం. దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్ధంగా పని చేయగలరని అంటున్నారు.ఈ సినిమాకు ప్రస్తుతం 'బ్రహ్మ రాక్షస్'అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'హను-మాన్' సీక్వెల్ 'జై హను-మాన్' పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. సినిమా హిస్టరీ బుక్స్ కాంతార' ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.

# పవన్ కళ్యాణ్ ఓజికి హైప్

## ప్రమోషన్స్‌లో బిజీగా ప్రియాంక అరుళ్

టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజి'. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీక్రి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ఎ÷-లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూలు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.




# మళయాల స్టార్ మోహన్‌లాల్ వృషభ

## 18న విడుదల కానున్న టీజర్

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు- టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 18న విడుదల చేయనున్నట్లు- తెలిపారు. ఈ సినిమా కథ పురాణాల నేపథ్యంలో, తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగపూరిత పోరాటంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు.




# ఓజి విడుదలకు ముందే సెన్సేషన్

## ఆస్ట్రేలియా, అమెరికాలో భారీగా బుకింగ్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్-టైనర్ ఓజిపై క్రేజు రోజుకూ ఆకాశాన్ని తాకుతోంది. టీజర్, గ్లింప్స్, పోస్టర్లు, పాటలు అంటూ వచ్చిన ప్రతి అప్డేట్‌కి భారీ రెస్పాన్స్ రావడం చూస్తుంటే, ఈ సినిమా మీద ఉన్న హైప్ ఏ రేంజ్‌లో ఉందో స్పష్టమవుతోంది. తెలుగులోనే కాకుండా, విదేశాల్లోనూ క్షఫ ఫీవర్ జోరుగా నడుస్తోంది. ఆస్ట్రేలియాలోని ప్రముఖ మెల్‌బోర్న్ థియేటర్‌లో టికెట్లు- నిమిషాల్లోనే సేల్ కావడం సినిమాపై భారీ అంచనాలను స్పష్టం చేస్తోంది. డిమాండ్ పెరగడంతో థియేటర్ యాజమాన్యం అదనపు షోలు ఎ÷-లాన్ చేస్తోంది. ఓ తెలుగు సినిమా అంత త్వరగా విదేశాల్లో టికెట్లు- అమ్ముడవడం చాలా అరుదైన విషయమే. అమెరికాలో ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. అక్కడి తెలుగు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో ఓ రేంజ్‌లో వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది. ఇండియాలోనూ సినిమాపై మాస్ లెవెల్‌లో అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియోకి భారీ రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ట్రైలర్ కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. తాజా సమాచారం మేరకు -ట్రైలర్‌ను సెప్టెంబర్ 18 లేదా 20న విడుదల చేయనున్నారు. దర్శకుడు సుజీత్ ప్రస్తుతం ట్రైలర్ కట్ మీద పూర్తి ఫోకస్ పెడుతున్నాడట. ఈ మూవీని అత్యాధునిక -టె-క్నికల్ స్టాండర్డ్స్‌తో రూపొందిస్తున్నారు. -ట్రైలర్ నుంచి థియేటర్ రిలీజ్ వరకూ ప్రమోషనల్ స్ట్రాటజీ అంతా పక్కా ప్లాన్‌తో చేస్తున్నారు. సెప్టెంబర్ 25 వరల్డ్‌వైడ్ థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. దసరా సీజన్‌ను టార్గెట్ చేస్తూ రిలీజ్ చేయడం, సినిమాకు కలిసొచ్చే అవకాశం ఉంది. ఈ దసరాకి బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమవుతోంది.




# మిరాయ్.. మహాబలుడు కాపీయా

## - తాజా వివాదం చక్కర్లు

తేజ సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' సినిమా తెలుగు ఇండస్ట్రీలో సంచలనం రేపుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర




దూసుకుపోతోంది. ఈ మూవీ మంచి కలెక్షన్స్ దక్కించుకుంటుంది. తొలి రోజు రూ. 27.2 కోట్లు వసూళ్లు రాబట్టగా, రెండో రోజు రూ.28.4 కోట్లు-, మూడో రోజు రూ.81.2 కోట్ల వసూళ్లు రాబట్టింది. వారాంతం వరకు 'మిరాయ్' రూ.100 కోట్ల మార్క్ దిశగా దూసుకుపోతోంది. కథ, యాక్షన్ సీక్వెన్స్‌లు, విజువల్ ఎఫెక్ట్స్ గురించి ప్రేక్షకులు విశేషంగా చర్చిస్తున్నారు.అయితే సినిమా విజయం మధ్యలోనే సోషల్ మీడియాలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. నెటిజన్ రవి వల్లభనేని టీ-÷-వట్ చేస్తూ.. 'మిరాయ్' సినిమా 1969లో విడుదలైన సూపర్ స్టార్ కృష్ణ నటించిన 'మహాబలుడు' సినిమా మక్కీకి మక్కీ కాపీలా ఉందని కామెంట్ చేశారు. అంతే కాదు, ఆ సినిమా యూట్యూబ్ లింక్ కూడా షేర్ చేశారు. దీంతో ఈ అంశం వైరల్‌గా మారింది. ఈ క్రమంలో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. కొందరు 'మిరాయ్ డైరెక్టర్ త్రివిక్రమ్ శిష్యుడిలా ఉన్నాడు అని అంటుండగా, మరి కొందరు మహాబలుడు, మిరాయ్‌లకు ఎలాంటి పోలిక లేదు. కథ, క్యారెక్టర్స్, సెంటిమెంట్ వేరు. ఇది కేవలం బురద జల్లడమే అని కొట్టిపారేస్తున్నారు. వివాదం ఒక వైపు కొనసాగుతుంటే, మరో వైపు సినీ ప్రముఖులు మాత్రం 'మిరాయ్' ని ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా రామ్ గోపాల్ వర్మ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. రూ.400 కోట్ల బడ్జెట్ ఉన్న సినిమాల కంటే కూడా బెటర్‌గా ఉన్నాయని ప్రశంసించారు. మంచు మనోజ్ విలన్‌గా నటించడం తప్పు అనుకున్నానని, కానీ సినిమా చూసిన తర్వాత తనకే తానే చెంపదెబ్బలు కొట్టుకున్నానని సరదాగా టీ-÷-వట్ చేశారు. మొత్తానికి 'మిరాయ్' బాక్సాఫీస్ దగ్గర రికార్డులు సృష్టిస్తూనే, కాపీ వివాదంతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.




# కూలీ ఓఎస్‌టి విడుదల

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం కూలీ. ఇటీ-వల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున విలన్ పాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగుతో పాటు- తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా నుంచి పాటలతో పాటు- వీడియోలను ఒక్కొక్కటిగా యూట్యూబ్ వేదికగా వదులుతున్నారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ ఒకిజినల్ సౌండ్ ట్రాక్ విడుదల చేశారు.



(ఆధ్యాత్మిక చింతన )

## సర్వప్రాణకోటి హితంగా సాగాలి !



**తిరుమల,సెప్టెంబర్16( వెలుతురు):**
సమస్తమూ శుభంగా సుఖంగా ఉండాలన్న అభిలాషను మన సనాతన ధర్మం ప్రస్ఫుటం చేస్తుంది. నలుదిశలా జ్ఞానకాంతులు ప్రసరించినప్పుడు, మనిషిలో ఆ తేజం ప్రతిఫలిస్తుంది. అటువంటి వికాసాన్నే అతడు ఆహ్వానించాలి. సానుకూల దృక్పథాన్ని అలవరచుకుంటే- మనసులో స్వార్థానికి, ద్వేషానికి తావు ఉండదు. కాలం ఇచ్చే అవకాశాల్ని అందిపుచ్చుకోవాలే తప్ప, సాటివారివి దోచుకోకూడదు. అదే విశ్వహిత కాంక్ష. సర్వ ప్రాణికోటికీ నేను మిత్రుణ్ని అని తెలిసినవాడు శాంతి పొందుతాడు' అని శ్రీకృష్ణ ఉవాచ. 'నాకు వారంతా తెలుసు' అనే అహంభావం కాదు, 'వారందరికీ నేను తెలుసు' అనుకోవడంలోఎంతో సంతోషం ఉంటుంది. నిస్వార్థమైన ప్రేమ గల హృదయ కవాటాలు ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయి. అసంఖ్యాక మిత్రుల్ని అవి ఆహ్వానిస్తాయి. నాలుగు మంచి మాటల వల్ల పోయేదేముంది- అహం తప్ప! బాధాతప్త హృదయానికి ఊరట కలిగించేది స్నేహస్పర్శ ఒక్కటే. అది ఆర్ద్రమైన సానుభూతికి స్పష్టమైన సంకేతం. అటువంటి విజయం సాధించినవారికి- ఒక్క అభినందన, మెచ్చుకోలు నిరంతర విజయ పరంపర కలిగిస్తాయి.!శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన గిరిని తన చిటికెన వేలితో ఎత్తి పట్టుకున్నప్పుడు, అక్కడి జనమంతా నిశ్చింతగా ఆ పర్వతం కిందకు వెళ్లి తలదాచుకున్నారు. అది తమమీద పడుతుందని అనుమానించినవారు బయటే ఉ ండిపోయి, ఇంద్రుడు సృష్టించిన రాళ్లవాన బారినపడ్డారు. కృష్ణభక్తులకు నమ్మకమే శ్రీరామరక్ష అయింది. విశ్వాసాన్ని మనిషి ఇతరుల నుంచి సాధించుకోగలగాలి. అప్పుడే సంతృప్తి మిగులుతుంది.

# మిస్టరీ మరణాలు గుట్టు తేలేనా

**- అంతు చిక్కని ఆ నలుగురి మరణాలు**

**తిరుపతి,సెప్టెంబర్16( వెలుతురు):**
తిరుపతి జిలలా పాకాల అడవిలో బయటపడిన మృతదేహాలు స్థానికంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా సమీపంలోని అడవిలో 2 మృతదేహాలు లభ్యమైనట్లు- తెలిపారు. అయితే.. మృతదేహాల పక్కనే 2 గోతులు తీసి పూడ్చిన ఆనవాళ్లు ఉన్నట్లు- పేర్కొన్నారు. ఆ రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నట్లు- అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులను పాతిపెట్టిన చోట మంగళవారం తవ్వకాలు జరపనున్నట్లు- పోలీసులు వెల్లడించారు. తిరుపతి సమీపంలోని పాకాల అడవిలో ఈనెల 14న మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అందులో ఓ మృతదేహం పాండిచ్చేరికి చెందిన కలై సెల్వన్‌దే అని తేలింది. అదే ప్రదేశంలో లభించిన



మృతదేహాలను అతడి వదిన జయమాలిని, ఆమె ఇద్దరు కుమార్తెలవని గుర్తించారు. నలుగురి మరణాలను హత్యలుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా, మృతురాలు తన భార్య అంటూ.. వెంకటేశన్ అనే వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. హత్యలకు వివాహేతర సంబంధమే కారణంగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాకాల అడవిలో బాగా కుళ్లిన స్థితిలో మృతదేహాలు బయటపడ్డాయి. పశువుల కాపర్లు మృతదేహాలను చూసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఓ వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలాడుతుండగా, పక్కనే వస్త్రం కప్పి ఉన్న మహిళ శవం ఉంది. ఆ పక్కనే మరో రెండు గోతులు తీసి పూడ్చిపెట్టిన ఆనవాళ్లూ కనిపించాయి. అందులో చిన్నారుల మృతదేహాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ఉపయోగించిన పార సమీప చెట్లపొదల్లో లభ్యం అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే వారి మరణాలకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# పేదరిక నిర్మూలన లక్ష్యంగా పి-4 కార్యక్రమం

**- బంగారు కుటుంబాలను దత్తత తీసుని అభివృద్ధి చేయాలి**

**- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్**


**విజయనగరం,సెప్టెంబర్16( వెలుతురు):**
పేదరిక నిర్మూలనే పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ స్పష్టం చేశారు. మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేవిధంగా కృషి చేయాలని కోరారు. పి4 కార్యక్రమం, బంగారు కుటు-ంబాలు, మార్గదర్శుల పాత్రపై, సచివాలయ సిబ్బంది నుంచి ఎంపిక చేసిన ఎంఓటిలు, టిఓటిలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో సున్నా



పేదరికమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని వివరించారు. మార్గదర్శులు పేద కుటు-ంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకొని, పేదరికం నుంచి వారు శాశ్వతంగా బయట పడేవిధంగా చైతన్య పరచడం, అవసరమైన విద్య, ఇతరత్రా సహకారాన్ని అందించడం చేయాల్సి ఉంటు-ందన్నారు. పి4 కార్యక్రమంలో సచివాలయ సిబ్బందిది కీలక పాత్ర అని, బంగారు కుటు-ంబాలకు, మార్గదర్శులకు మధ్య వారు వారధి వంటివారని జెసి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనలో ప్రజల్ని భాగస్వాములను చేస్తూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా అమలు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేసి విజయవంతం చేయాలని జెసి పిలుపునిచ్చారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది నుంచి మండలానికి ఇద్దరు మాష్టర్ ఆఫ్ -ట్రైనీలను, 12 మంది టిఓటిలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పి4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటు-ంబాల అవసరాలను గుర్తించి, వాటిని మార్గదర్శుల ద్వారా తీర్చేందుకు అవసరమైన సూచనలను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలు జరుగుతుందని, ఉత్తమ పనితీరు చూపిన వారికి, మార్గదర్శులకు అవార్డులను కూడా అందిస్తామని సిపిఓ వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యప్రణాళికా శాఖ డిప్యుటీ- డైరెక్టర్ రాజశేఖర్, స్వర్ణాంధ్ర పి4 కార్యక్రమం కన్సల్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్స్ కేసు

**- సోనూసూద్ సహా ఇద్దరు క్రికెటర్లకు ఇడి సమన్లు**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్16( వెలుతురు):**
మనీలాండరింగ్ కేసులో నటుడు సోనూసూద్ సహా ఇద్దరు మాజీ క్రికెటర్లకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఈనెల 22న మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప, 23న యువరాజ్ సింగ్, 24న సోనూసూద్ విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో సూచించింది. నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ లావాదేవీల్లో మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ ఉతప్పను ప్రశ్నించనుంది. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురు మాజీ క్రికెటర్లకు సమన్లు అందాయి. మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లను ఇటీవలే ఈడీ ప్రశ్నించింది. ఇదే కేసులో టీఎంసీ మాజీ ఎంపీ, నటి మిమి చక్రవర్తిని ఈడీ సోమవారం విచారించి ఆమె వాగ్మూలం నమోదు చేసింది. బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. నటి ఊర్వశీ రౌతేలా కూడా బెట్టింగ్ యాప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమెకు కూడా నోటీసులు వెళ్లాయి. అక్రమ బెట్టింగ్ యాప్‌లు అనేకమందిని లూటీ- చేసినట్లు- దర్యాప్తు సంస్థ విచారణలో తేలింది. పెట్టుబడిదారులు రూ.కోట్లు- దండుకొని పన్నులు ఎగవేసినట్లు- వెల్లడైంది. వెబ్‌సైట్ ప్రకారం గత 18 ఏళ్లుగా ఈ కంపెనీ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. స్పోర్ట్స్ ఈవెంట్లపై పందెం కాస్తే ఎక్కువ మొత్తం గెలుచుకోవచ్చని ఆశ చూపిస్తోంది. 70 భాషల్లో ఈ యాప్ ఉండటం గమనార్హం.


# విమోచన కాదు..విలీనమే

**- సెప్టెంబర్ 17పై నారాయణ వివరణ**

**హైదరాబాద్,సెప్టెంబర్16( వెలుతురు):**



సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినమేనని.. విముక్తి దినం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. కానీ భాజపా వారు దీన్ని ముస్లింలపై సాధించిన విజయంగా చూపడానికి విముక్తి దినంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నారాయణ విలేకర్లతో మాట్లాడారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన తెలంగాణ సాయుధపోరాటంలో నాలుగున్నర వేల మంది చనిపోయారని చెప్పారు. కమ్యూనిస్టుల త్యాగాలను తక్కువచేసి చూపే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పటేల్‌ను ఉ పయోగించుకొని కమ్యూనిస్టుల ఉద్యమాన్ని తక్కువగా చూపించే కుట్రను అమలుచేస్తున్నారని ధ్వజమెత్తారు. మగ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో సెప్టెంబరు 11న తెలంగాణ సాయుధపోరాటం ప్రారంభమైన తరుణంలో నిజాం నవాబు సెప్టెంబరు 17న విధిలేక కేంద్రానికి లొంగిపోయారని పేర్కొన్నారు. రాజీమార్గం ద్వారా ఆనాడు విలీనం జరిగిందన్నారు. అందుకే దాన్ని తాము విలీనదినంగానే ప్రకటిస్తున్నామని నారాయణ చెప్పారు. దీనిని చిలువలు పలువలుగా చేసి బిజెపి రాజకీయ లబ్ది కోసం పాకులాడుతోందన్నారు. కమ్యూనిస్టులు ఆనాడు చూపిన తెగువ మరువలేనిదన్నారు. భారత్‌లో నిజాం యూనియన్ విలీనం అయ్యిందన్నది వాస్తవమని నారాయణ అన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com